TGTEL/26/A4985

# ఆదాబ్ సైబరాబాద్

www.adaabcyberabad.com
epaper.adaabcyberabad.com
adaabcyberabad@gmail.com

ADAAB CYBERABAD

ఎడిటర్ : బిల్లాల్‌పూర్‌సారా శివ కుమార్ | సంపుటి : 1 | సంచిక : 36 | బుధవారం, 19 ఆగస్టు, 2026 | పేజీలు - 4 | వెల: 5/-

EDITOR : BILLALPURSARA SHIVA KUMAR | VOLUME : 1 | ISSUE: 36 | 19-08-2026 (WEDNESDAY) | PAGES: 4 | RS : 5/-

## అమరవీరుల స్తూపానికి ఉన్న ప్రాధాన్యతే

# పాపన్న గౌడ్ విగ్రహానికి ఉండాలి

**హైదరాబాద్ :** తెలంగాణ చరిత్రలోనే బీసీల జనాభా లెక్కలు తేల్చి సామాజిక న్యాయం అందించిన తొలి ప్రభుత్వం తమదేనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. గత బీఆర్ఎస్? ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాలను నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. అర్హులైన నేత, గీత కార్మికులకు పెన్షన్లు ఇవ్వాలని నిర్ణయించిన ట్లు వెల్లడించారు. ప్రజాపాలనను కాపాడుకోవాలని, మళ్లీ పాత దొరల గద్దెనెక్కేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ అవకాశం ఇవ్వొద్దని పిలుపునిచ్చారు. హైదరాబాద్ ట్యాంక్ బండ్ వద్ద ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయ్ పాపన్న గౌడ్ విగ్రహాన్ని మంత్రులు, గౌడ సంఘాల నేతల సమక్షంలో సీఎం రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. గౌడ, యాదవ, ముదిరాజ్, దళిత వర్గాలను ప్రోత్సహించేలా కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు చేపట్టిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఏ ఒక్క కులానికో, మతానికో పరిమితం కాలేదని, బహుజనులను ఏకతాటిపైకి తెచ్చి గోల్కొండ కోటపై జెండా ఎగురవేశారని రేవంత్ రెడ్డి తెలిపారు. కాంగ్రెస్? ప్రభుత్వంలో సామాజిక న్యాయం : కులవృత్తులను గౌరవిస్తూనే పిల్లలను ఎట్టి పరిస్థితుల్లోనూ చదివించాలని తల్లిదండ్రులను సీఎం రేవంత్ రెడ్డి కోరారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కుటుంబ న్యాయం మాత్రమే జరిగిందని కాంగ్రెస్ ప్రభుత్వంలో సామాజిక న్యాయం



చేస్తున్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. నేత, గీత కార్మికులకు పెన్షన్లు ఇవ్వాలని ఇప్పటికే ఆదేశాలు ఇచ్చామని సీఎం తెలిపారు. బీసీల జనాభా లెక్కలు తేల్చి సామాజిక న్యాయం అందించిన తొలి ప్రభుత్వం తమదేనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రతిపక్షంలో ఉన్న కేటీఆర్, హరీశ్?రావు ప్రభుత్వంపై అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని ఆక్షేపించారు. రాష్ట్రంలో కరవు రావాలని కోరుకుంటూ అఘోరాల తో చేతబడులు చేయించారని ఆరోపించారు. పాత దొరల పాలన మళ్లీ రావడానికి ఎట్టి పరిస్థితుల్లోనూ అవకాశం ఇవ్వొద్దని ప్రజలను కోరారు. మరోసారి అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్?నే : గత బీఆర్ఎస్ పాలనపై సీఎం రేవంత్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. 'నాడు గొర్రెలు, బర్రెలు, చేపలు పంపిణీ చేసి.. రాజ్యం వాళ్లు ఏలుతూ, మనల్ని కుల వృత్తులకే పరిమితం చేయాలని చూశారు' అని ఎద్దేవా చేశారు. కేసీఆర్ సీఎం అయితే ఆయన కొడుకు కేటీఆర్ వర్కింగ్ ప్రెసిడెంట్, అల్లుడు హరీశ్ రావు మంత్రి అయ్యారని.. అదే రేవంత్ సీఎం అయితే బీసీ నేత మహేష్ కుమార్ గౌడ్ పీసీసీ చీఫ్, సీతక్క, వాకిటి శ్రీహరి మంత్రుల య్యారని వ్యంగ్యాస్త్రాలు విసిరారు. కాంగ్రెస్ అధికా రంలోకి వచ్చాక శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మ, చాకలి ఐలమ్మ మనుమరాలికి కీలక పదవులు ఇచ్చి ఉద్యమకారులను గౌరవించామని తెలిపారు. రాబోయే డీలిమిటేషన్ తర్వాత 117 సీట్లతో మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

## ఎలక్షన్ కమిషన్ నిర్లక్ష్యంగా

# ఓట్లను తొలగించింది



**హైదరాబాద్ :** ఓటర్ల జాబితా (ప్రత్యేక సమగ్ర సవరణ పేరుతో ఎన్నికల సంఘం తెలంగాణలో నిర్లక్ష్యంగా ఓట్లను తొలగించిందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. సర్ ముసాయిదా జాబితాను రాష్ట్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన నేపథ్యంలో గాంధీభవన్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో మహేశ్‌కుమార్ గౌడ్ మాట్లాడారు. హైదరాబాద్ నగరంలో బీఎల్‌వోలు ఎవరి ఇంటికీ వెళ్లలేదని ఆరోపించారు. పేదలు, వలస కూలీల ఓట్లనే ఎక్కువగా తొలగించారని విమర్శించారు. 2002 నాటి ఓటర్ల జాబితా ఎంతమందికి అందుబాటులో ఉందని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం సీబీఐ, ఈడీలాగే ఎన్నికల సంఘాన్ని కూడా తన జేబు సంస్థగా మార్చుకుందని చెప్పారు. 2002 నాటి ఓటర్ల జాబితాతో ముడిపెట్టకుండా పౌరులకు ఓటు హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అకా రణంగా 73 లక్షల ఓట్లను ఎన్నికల సంఘం తొలగించిందన్నారు. మొత్తంగా 92 లక్షల ఓట్లను ఈసీ ప్రశ్నార్థకం చేసిందని అన్నారు. డీలిమిటేషన్, పోలింగ్ కేంద్రాల మార్పువల్ల 2002 నాటవివరాలు సరిగా లేవనీ వివరాలు సరిగా లేవని చెప్పారు. లక్షల మంది ఓట్లు తొలగించి ప్రజాస్వామ్య దేశమంటే ఎలా..? అని మహేశ్‌కుమార్‌గౌడ్ ప్రశ్నించారు.

# హరీశ్‌రావు కాదు.. అబద్దాల రావు

## ఆ భూములను 22ఏ నుంచి తొలగిస్తాం..



**హైదరాబాద్, ఆగస్టు 18 :** మాజీ మంత్రి హరీశ్‌రావుపై తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి విమర్శలు గుప్పించారు. హరీశ్‌రావు కాదు ఆయన అబద్దాల రావు అని ఎద్దేవా చేశారు. 22ఏ లో ఆయన కొండను తవ్వి ఎలుకను పట్టారని.. దాన్ని గొప్పగా చెప్పుకుంటున్నారని సెటైర్లు గుప్పించారు. (మంగళవారం)మంత్రి పొంగులేటి మాట్లాడా రు. గతంలో సాఫ్ట్ కాపీ అప్‌లోడ్ చేయకపోవడం వల్ల తప్పు జరిగిందని తామే గుర్తించామని పేర్కొన్నారు. హరీశ్‌రావు ఎత్తు పెరగడం కాదని.. విమర్శలు చేసే ముందు బుర్ర కూడా ఉపయోగించాలని మంత్రి వ్యగ్యంగా మాట్లాడారు. ఎవరికీ అన్యాయం జరగనివబోమని అన్నారు. ప్రభుత్వ భూములు కాకపోతే కచ్చితంగా వాటిని 22ఏ నుంచి తొలగిస్తామని స్పష్టం చేశారు. కేసీఆర్ హయాంలో మాదిరిగా తాము బుకాయించడం లేదని చెప్పారు. కేంద్రం, ఎన్నికల సంఘం, బీఆర్ఎస్ కలిసి ఓట్లను తొలగించే కుట్రను చేస్తున్నాయని.. వారి పప్పులు ఉడకనివ్వబోమని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హెచ్చరించారు.

## 'నీట్' విద్యార్థులపై

# పోలీసు చర్యలు

**ఢిల్లీ:** ఢిల్లీలో నీట్ నిరసనల సందర్భంగా విద్యార్థులను చెదరగొట్టేందుకు పోలీసులు అతిగా చర్యలు తీసుకున్నారనే ఆరోపణలపై విచారణ చేసేందుకు ఒక హైపవర్ కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు సుప్రీంకోర్టు మంగళవారం తెలిపింది. ఇందులో రిటైర్డ్ న్యాయమూర్తులు, మాజీ డీజీపీ, మాజీ సీబీఐ డైరెక్టర్లు ఉంటారని స్పష్టం చేసింది. ఇంకా ఈ కమిటీలో చేర్చాల్సిన ఇతర సభ్యుల గురించి వివిధ పక్షాల నుంచి సూచనలు అందిన తర్వాత, కమిటీ ఏర్పాటుకు సంబంధించిన ఉత్తర్వులను బుధవారం విడుదల చేస్తామని తెలిపింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్? జోయ్ మాల్య బాగ్చీ, జస్టిస్? వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఈ కేసు విచారణ చేపట్టింది. జులై 20న ఢిల్లీలో జరిగిన పార్లమెంట్ మార్చ్ సందర్భంగా జరిగిన హింసకు సంబంధించిన వీడియో ఫుటేజీ, సీసీటీవీ రికార్డింగ్?లను, తాము ఏర్పాటు చేయనున్న హైపవర్ కమిటీకి అందజేయాలని ఆదేశించనున్నట్లు పేర్కొంది. ఢిల్లీ సహా ఇతర ప్రాంతాల్లో జరిగిన నిరసనల్లో పాల్గొన్న మహిళల ఫిర్యాదులను, ఆరోపణలను కూడా ఈ కమిటీ పరిశీలిస్తుందని స్పష్టం చేసింది.

## జహీరాబాద్ స్మార్ట్ సిటీతో 2 లక్షల మందికి ఉపాధి

# రూ. 15 వేల కోట్ల పెట్టుబడులే లక్ష్యం

**హైదరాబాద్ :** నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ అండ్ ఇంప్లిమెంటేషన్ ట్రస్ట్ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న శ్రీధర్ బాబుతెలంగాణ పారిశ్రామిక రంగానికి జహీరాబాద్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ ఒక కొత్త ఊపునివ్వనుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. ఈ స్మార్ట్ సిటీ పూర్తి స్థాయిలో అందు బాటులోకి వస్తే ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు 2 లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. 3,245 ఎకరాల భారీ విస్తీర్ణంలో అభివృద్ధి చేస్తున్న ఈ స్మార్ట్ సిటీ ద్వారా సుమారు రూ. 15 వేల కోట్ల పెట్టుబడు లను ఆకర్షించడమే లక్ష్యంగా పెట్టుకు న్నట్లు చెప్పారు. ఢిల్లీలో కేంద్ర ఆర్థిక మం త్రి నిర్మలా సీతారామన్, వాణిజ్య-పరిశ్ర మల మంత్రి పీయూష్ గోయెల్‌లు సం యుక్తంగా నిర్వహించిన 'నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ అండ్ ఇంప్లిమెంటేషన్ ట్రస్ట్' వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి శ్రీధర్‌బాబు సచివాలయం నుంచి వర్చువల్‌గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జహీరాబాద్ స్మార్ట్ సిటీ అభివృద్ధి పనులన్నింటినీ 2028 మార్చి నాటికి పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ఈపీసీ (ఇంజినీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, కన్‌స్ట్రక్షన్) విధానంలో జరుగుతున్న ఈ పనులను గడువులోగా పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందించామని వివరించారు. ఈ స్మార్ట్ సిటీలో భూమి రూపంలో తెలంగాణ ప్రభుత్వ వాటా 51 శాతం ఉండగా, మౌలిక వసతుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిధులు సమకూరుస్తోందని మంత్రి



పేర్కొన్నారు. పరిశ్రమలకు అవసరమైన ప్లగ్ అండ్ ప్లే సదుపాయాలను వేగవంతం చేస్తున్నామని తెలిపారు. ఇదే క్రమంలో, 'భారత్ ఔద్యోగిక్ వికాస్ యోజన' (భవ్య) కింద కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ప్రకటించిన 100 ప్లగ్ అండ్ ప్లే పారిశ్రామిక పార్కుల్లో నాలుగింటిని తెలంగాణకు కేటాయించాలని కేంద్ర మంత్రి పీయూష్ గోయెల్‌ను ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు కోరారు.

## మీరు చేసిన తప్పులకి

# ప్రజలకు ఎందుకు శిక్ష.

**మల్కాజిగిరి, ఆగస్టు 18:**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు మరోసారి తీవ్రస్థాయి లో విరుచుకుపడ్డారు. (మంగళవారం) మీడియాతో మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి తుగ్లక్ నిర్ణయాలతో రాష్ట్ర పాలన పిచ్చోడి చేతిలో రాయిలా మారిందని వ్యాఖ్యానించారు. రాత్రికి రాత్రే కాలనీల్లో ప్రభుత్వం అమ్మిన భూములు, హెచ్ఎండీఏ అమ్మిన భూములను కూడా నిషేధిత జాబితాలో పెట్టారని మండిపడ్డారు. 'మీరు చేసిన తప్పులకి ప్రజలకు ఎందుకు శిక్ష? పొంగులేటి శ్రీనివాసరెడ్డి.. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలు నా చేతిలోకి రావాలని ఈ నిర్ణయం తీసుకున్నారు. అధికారులు తప్పు చేశారు.. సారీ అని పొంగులేటి చెప్తే సరిపోతుందా? ఇది 30% గవర్నమెంట్... ఏ పని కావాలన్నా 30% కమీషన్ అడుగుతున్నారు' అంటూ విరుచుకుపడ్డారు. రేవంత్ రెడ్డి ఇల్లు నిషేధిత జాబితాలో ఉందని.. మరి సీఎం ఎక్కడ మీసేవకు వెళ్లి దరఖాస్తు చేసుకున్నారో చెప్పాలని మాజీ మంత్రి డిమాండ్ చేశారు. ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల వల్ల ప్రజలు రిజిస్టర్ ఆఫీస్ చుట్టూ.. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన



దుస్థితి నెలకొందని మండిపడ్డారు. పొంగులేటి నైతిక బాధ్యత వహిస్తూ వెంటనే మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నిషేధిత భూములతో పాటు ప్రభుత్వ భూములు, అసైన్మెంట్ భూములను కాజేసే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. నిషేధిత జాబితాల నుంచి తొలగించిన భూముల లిస్ట్‌ను పబ్లిక్ డొమైన్‌లో పెట్టాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, పొంగులేటి కలిసి కుట్ర చేస్తున్నారని.. తప్పు వారు చేసి అధికారులపై నెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## మున్సిపాలిటీల్లో బీసీలకు

# 34 శాతం రిజర్వేషన్



**అమరావతి:** బీసీల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ఏపీ అసెంబ్లీ సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నామని చెప్పారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పించడం కేవలం ఎన్నికల హామీ కాదని, అది తమ రాజకీయ సిద్ధాంతంలో భాగమని చంద్రబాబు స్పష్టం చేశారు. హామీలు ఇవ్వడంతోనే ఆగిపోకుండా వాటిని అమలు చేసి చూపిస్తున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. గత ప్రభుత్వం బిసిలకు రిజర్వేషన్ల విషయంలో చేసిన అన్యాయన్ని సరిచేయడానికి ప్రత్యేక క్యాబినెట్ పెట్టి నిర్ణయం తీసుకున్నట్లు సీఎం చెప్పారు. 2024 ఎన్నికల్లో ఈ స్థాయి గెలుపుకు కారణం బిసిల వల్లేనని చెప్పుకొచ్చారు. 94శాతం స్ట్రయిక్ రేట్ 57శాతం ఓట్లు వచ్చాయంటే అది బిసిల వల్ల, నాయకత్వంపై ఉన్న నమ్మకం వల్ల మాత్రమేనని పేర్కొన్నారు. బిసిలకు న్యాయం చేయాలని తాను, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, బీజేపీ నేతలు ఎన్నికలకు ముందే నిర్ణయం తీసుకున్నామన్నారు. బీసీలకు రాజకీయంగా మరింత ప్రాతినిధ్యం కల్పించేందుకు గ్రామీణ స్థానిక సంస్థల్లో 34 శాతం, పట్టణ స్థానిక సంస్థల్లో 33.33 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని చెప్పారు. ఈ రెండు అంశాలకు సంబంధించిన నిబంధనలు చట్టాల్లో ఉన్నాయని వివరించారు. అర్బన్ లోకల్ బాడీల్లో మేయర్లు, మున్సిపల్ చైర్మన్లను ప్రత్యక్ష ఎన్నికల ద్వారా ఎన్నుకునే విధానం ఉంటుందని చంద్రబాబు వెల్లడించారు. రాబోయే రోజుల్లో 28 జిల్లా పరిషత్‌లు ఏర్పడే అవకాశం ఉందన్నారు.

## ఆ భూములను లాక్కుంటే..

# చూస్తూ ఊరుకోం.

**హైదరాబాద్, ఆగస్టు 18 :**

తాము అధికారంలోకి వస్తే 'భూలక్ష్మి' పేరుతో పేదలకు భూమి పంపిణీ చేస్తామని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. పేదల భూములను రేవంత్‌రెడ్డి సర్కార్ లాక్కుంటే.. చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. (మంగళవారం) హైదరాబాద్ లోని బంజారా హిల్స్ టీఆర్ఎస్ కార్యాలయ ంలో కవిత మీడియాతో మాట్లాడారు. బీసీలకు పెద్దపీట వేస్తామని చెప్పినా.. ఆచరణలో మాత్ర ం సామాజిక న్యా యం ఎందుకు కనిపించడం లేదని ప్రశ్నించారు. విజయశాంతి లాంటి ఉద్యమకారుల ను పక్కన పెట్టారు. .విజయ శాంతి లాంటి ఉద్యమకారులను పక్కన పెట్టి.. మంత్రి పదవి ఇవ్వకుండా ఎమ్మెల్సీ పదవితో సరిపెట్టారని కవిత పేర్కొన్నారు. ప్రభుత్వం నియమించిన అడ్వైజర్ల జీతాల విషయంలోనే సామాజిక న్యాయం ఎందుకు కనిపించట్లేదని నిలదీశారు. రేవంత్‌రెడ్డి చెప్పేది సామాజిక న్యాయం.. కానీ



ఆచరణలో మాత్రం ఆటవికా న్యాయమా..? అని ప్రశ్నించారు. అప్పర్ క్లాస్ మాట్లాడితే ఓ రకమైన చర్యలు.. లో క్లాస్ మాట్లాడితే మరో రకమైన చర్యలు తీసుకుంటారా..? ఇదేనా రేవంత్‌రెడ్డి సామాజిక న్యాయం.? అని ప్రశ్నల వర్షం కురిపించారు.

# ఎల్‌నినో పరిస్థితుల్లో నీటి వినియోగంపై సమతుల్య విధానం

**– రిజర్వాయర్ల నిల్వలు, వరద ప్రవాహాలు, వర్షపాత అంచనాల ఆధారంగానే నీటి విడుదల ఉండాలి**
**– సాగర్‌లో 164 టీఎంసీల నీటి నిల్వ.. 47 శాతం ఫ్లడ్ కుషన్**





**ఆదాబ్ సైబరాబాద్, హైదరాబాద్ :** ఎల్‌నినో పరిస్థితులు, రానున్న రోజుల్లో వర్షపాతం ఎలా ఉంటుందో స్పష్టత లేని నేపథ్యంలో తాగునీటి అవసరాలను కాపాడుతూనే రైతుల పంటలకు అవసరమైన సాగునీటిని అందించేలా సమతుల్య విధానంతో ముందుకు సాగాలని నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మిగిలిన ఖరీఫ్ సీజన్‌లో రిజర్వాయర్ల నీటి నిల్వలు, సాగునీటి పరిస్థితిపై జలసౌధలో మంగళవారం ఆయన సమీక్ష నిర్వహించారు. భవిష్యత్తులో భారీ వర్షాలు కురుస్తాయనే ఆశావహ అంచనాలపై ఆధారపడకుండా, ప్రస్తుతం అందుబాటులో ఉన్న వినియోగించగల నీటి నిల్వలు, నమ్మదగిన వరద ప్రవాహాలు, వాస్తవ వర్షపాత అంచనాల ఆధారంగా నీటి నిర్వహణ చేపట్టాలని సూచించారు. తాగునీటి భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని మంత్రి స్పష్టం చేశారు. అయితే తాగునీటి అవసరాలకు కేటాయించిన నీటికి మించి రిజర్వాయర్లలో అందుబాటులో ఉన్న నీటిని నిల్వ ఉంచకుండా నిలిచిపోయిన పంటలకు అవసరమైన మేరకు సాగునీరు అందించాలని సూచించారు. "తాగునీటి అవసరాలను కాపాడుతూనే అందుబాటులో ఉన్న అదనపు నీటిని పంటలకు అందించాలి. ప్రతి నీటి విడుదల నిర్ణయం వాస్తవ నిల్వలు, నమ్మదగిన వరద ప్రవాహాలు, వర్షపాతంపై వాస్తవిక అంచనాల ఆధారంగానే ఉండాలి" అని ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు.

## ■ ప్రధాన రిజర్వాయర్లలో 74.57 శాతం నీటి నిల్వ

కృష్ణా బేసిన్‌లోని ప్రధాన రిజర్వాయర్లలో 76.63 శాతం నీరు నిల్వ ఉన్నట్లు సమీక్షలో వెల్లడైంది. మొత్తం 973.68 టీఎంసీల సామర్థ్యానికి గాను 746.12 టీఎంసీల నీరు అందుబాటులో ఉంది. గోదావరి బేసిన్‌లోని రిజర్వాయర్లలో 68.1 శాతం నీరు నిల్వ ఉంది. 306.20 టీఎంసీల సామర్థ్యానికి గాను 208.38 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు మంత్రికి వివరించారు. కృష్ణా బేసిన్‌లోని ఉమ్మడి ప్రాజెక్టు నాగార్జునసాగర్‌లో ప్రస్తుతం 164 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 312 టీఎంసీలు కాగా, ప్రస్తుతం సుమారు 47 శాతం ఫ్లడ్ కుషన్ అందుబాటులో ఉంది. నాగార్జునసాగర్ ఎడమ కాలువ కింద నల్గొండ, సూర్యాపేట, ఖమ్మం జిల్లాల్లో 6.4 లక్షల ఎకరాలకు పైగా ఆయకట్టు ఉంది. రిజర్వాయర్లలో మొత్తం నిల్వ శాతాన్ని మాత్రమే చూపిస్తూ పరిస్థితిపై అతిగా ఆశావహ అంచనాలు ఇవ్వొద్దని మంత్రి అధికారులను హెచ్చరించారు. ప్రతి సమీక్షలో రిజర్వాయర్ మొత్తం సామర్థ్యం, లైవ్ స్టోరేజ్, వినియోగించగల నీరు, ఇప్పటికే ఉన్న అవసరాలు, సాగునీటికి వాస్తవంగా అందుబాటులో ఉన్న నీటి పరిమాణాన్ని స్పష్టంగా చూపించాలని ఆదేశించారు. 2025, 2026 సంవత్సరాల్లో ఇదే సమయానికి ఉన్న నీటి నిల్వలు, ఇన్‌ఫ్లో పరిస్థితులను పోల్చి చూడాలని సూచించారు. సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో తప్పనిసరిగా భారీ వరద ప్రవాహాలు వస్తాయని భావించి ప్రణాళికలు రూపొందించవద్దని స్పష్టం చేశారు.

## ■ ఆధారపడదగిన నీటి వనరులతో పంటలకు రక్షణ

మిగిలిన ఖరీఫ్ సీజన్‌లో నమ్మదగిన ప్రతి నీటి వనరును వినియోగించి నిలిచిన పంటలను కాపాడటం, ఇన్‌ఫ్లోపై అనిశ్చితి ఉన్న రిజర్వాయర్లలో నీటిని పొదుపుగా వినియోగించడం, రైతులకు పూర్తి పారదర్శకతతో సమాచారం అందించడం ప్రభుత్వ లక్ష్యమని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.
వైరా రిజర్వాయర్ పరిస్థితిని మంత్రి ప్రత్యేకంగా సమీక్షించారు. గోదావరి నీటితో తిరిగి నింపుకునే అవకాశం ఉన్నప్పటికీ సాగునీటి విడుదలలో ఎందుకు జాప్యం జరుగుతోందని అధికారులను ప్రశ్నించారు. అనిశ్చిత ఇన్‌ఫ్లోలపై ఆధారపడే రిజర్వాయర్లలో నీటిని సంరక్షించడంతో పాటు, నమ్మదగిన రీచార్జ్ అవకాశం ఉన్న చోట సాగునీటి విడుదలను అనవసరంగా పరిమితం చేయొద్దని సూచించారు. దేవాదుల, నిజాంసాగర్, స్వర్ణ, సదర్మాట్ ఆనకట్ట, రామడుగు, బుగ్గలవాగు, రామపల్లి, పాలెంవాగు, గౌరవరం, పోచారం, రాజీవ్‌సాగర్, నెలవాయి, వట్టివాగు, నల్లవాగు, పాల్వాయి పురుషోత్తమరావు (ఎర్రవాగు), చెల్మెలవాగు (ఎన్‌టీఆర్ సాగర్) ప్రాజెక్టుల నుంచి అందుబాటులో ఉన్న నీటిని పరిశీలించి, ధృవీకరించిన నీటి లభ్యత ఆధారంగా సాగునీటి విడుదలకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అందుబాటులో ఉన్న మూసీ నీటిని కూడా సాగునీటి అవసరాలకు సమర్థంగా వినియోగించాలని సూచించారు.

## ■ ఎస్ఆర్ఎస్‌పీ ప్రణాళికలు నిల్వలకు అనుగుణంగా ఉండాలి

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు (ఎస్ఆర్ఎస్‌పీ) కింద సాగునీటి ప్రణాళికలు ప్రస్తుత నీటి నిల్వలు, ఇన్‌ఫ్లో పరిస్థితులకు అనుగుణంగా ఉండాలని మంత్రి అన్నారు. నిజాంసాగర్, లోయర్ మానేరు డ్యామ్, సింగూర్ తదితర గోదావరి బేసిన్ రిజర్వాయర్ల పరిస్థితిని కూడా సమీక్షించారు.

## ■ సింగూర్ మరమ్మతులకు ప్రాధాన్యం

సింగూర్ డ్యామ్ మరమ్మతులు, బలోపేత పనులకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు. రిజర్వాయర్ తాజా నీటి నిల్వ పరిస్థితిని ఇంజినీర్లు పరిశీలించి, సాంకేతిక సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. శ్రీశైలం ఎడమగట్టు కాలువ సొరంగం పనుల పురోగతిని కూడా మంత్రి సమీక్షించారు. ఇన్‌లెట్, ఔట్‌లెట్ వైపుల నుంచి సొరంగం తవ్వకం కొనసాగుతున్నట్లు అధికారులు వివరించారు. కఠినమైన భౌగోళిక ప్రాంతాల్లో పనులను ఇంజినీర్లు నిశితంగా పర్యవేక్షించాలని, భద్రత విషయంలో రాజీపడకుండా మిగిలిన పనులను వేగవంతం చేయాలని మంత్రి ఆదేశించారు. సాంకేతిక అధ్యయనాల కోసం కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ), భారత వాతావరణ శాఖ (ఐఎండీ) నుంచి అందుతున్న తాజా సమాచారాన్ని ఉపయోగించాలని సూచించారు. పాత డేటాపై ఆధారపడకుండా నదుల క్రాస్ సెక్షన్లను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని ఆదేశించారు.

## ■ పోలవరం ముంపుపై సాంకేతిక అధ్యయనం

పోలవరం ప్రాజెక్టు వల్ల తెలంగాణలో ఏర్పడే ముంపు ప్రభావంపై ఐఐటీ నిపుణులు చేపడుతున్న అధ్యయనాన్ని త్వరగా పూర్తి చేయించేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. సంభవించే వరదలు, ముంపు విస్తీర్ణాన్ని స్పష్టంగా అంచనా వేసి, అవసరమైన చోట కేంద్రం నుంచి రక్షణ చర్యలు కోరేందుకు బలమైన సాంకేతిక ఆధారాలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

## ■ అంతర్రాష్ట్ర జల వివాదాలపై సమీక్ష

తెలంగాణకు సంబంధించిన అంతర్రాష్ట్ర జల వివాదాలు, ట్రిబ్యునల్, సుప్రీంకోర్టులో కొనసాగుతున్న కేసుల పరిస్థితిని కూడా ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్షించారు. ట్రిబ్యునల్ విచారణలు, సుప్రీంకోర్టు కేసులు, కృష్ణా జలాల నిర్వహణ, విద్యుత్ ఉత్పత్తి, కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) పరిధి తదితర అంశాలపై సంక్షిప్త నివేదిక సిద్ధం చేయాలని సీనియర్ నీటిపారుదల, ఇంజినీరింగ్, న్యాయ అధికారులను ఆదేశించారు. సమీక్షలో నీటిపారుదల శాఖ కార్యదర్శి ఈ. శ్రీధర్, ఇంజినీర్–ఇన్–చీఫ్ (జనరల్) ఓ.వి. రమేష్ బాబు, జాయింట్ సెక్రటరీ కె. శ్రీనివాస్, టన్నెల్ నిపుణుడు కల్నల్ పరిక్షిత్ మెహ్రా, ఇంజినీర్–ఇన్–చీఫ్ (అడ్మినిస్ట్రేషన్) టి. శ్రీనివాస్, ఇంజినీర్–ఇన్–చీఫ్ (ఓఅండ్ఎం, క్వాలిటీ కంట్రోల్) ఆర్. మధుసూదన్ రావు తదితర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

# మేడారం నార్లాపూర్ పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ములుగు డీఎస్పీ యన్. రవీందర్



**– నేను సైతం కార్యక్రమం కింద 16 సీసీ కెమెరాలు ప్రారంభించిన డి.ఎస్.పి**

**ఆదాబ్ సైబరాబాద్,ములుగు:** డీఎస్పీ ఎన్.రవీందర్ ములుగు జిల్లాలోని తాడ్వాయి మండలం మేడారంలోనీ నార్లాపూర్ పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా తనిఖీ చేయడం జరిగింది ఇందులో భాగంగా పోలీస్ స్టేషన్ రికార్డులను తనిఖీ చేయడం జరిగింది, అదేవిధంగా రౌడీ కేడి ఉన్న వ్యక్తులను ఎప్పటికప్పుడు తనిఖీ చేసి వారి యొక్క ప్రవర్తనను గమనిస్తూ ఉండాలని తెలియజేయడం జరిగింది అదేవిధంగా దర్యాప్తును త్వరితగరితన చేసి బాధితులకు త్వరగా న్యాయం అందేలా చూడాలని సూచనలు చేయడం జరిగింది
గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని యువతకు మరియు విద్యార్థులకు ఎప్పటికప్పుడు అవగాహన కార్యక్రమం నిర్వహించి వారిలో అవేర్నెస్ కల్పించాలని సిబ్బందికి సూచించడం జరిగింది నార్లపూర్ పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతాలలో కలియతిరిగి పోలీస్ స్టేషన్ పరిసరాలను శుభ్రంగా ఉంచుకొని 5ఎస్ విధానం పాటించాలని సిబ్బందికి సూచించడం జరిగిందిఅదేవిధంగా నేను సైతం కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు ఆవిష్కరించారు. ప్రజలంతా తమ వంతు బాధ్యతగా తమ తమ గ్రామాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా సూచించారుఇట్టి కార్యక్రమంలో పసర సీఐ దయాకర్ నార్లాపూర్ ఎస్ హెచ్ ఓ ఎస్ కమలాకర్
పాల్గొనడం జరిగింది.

# క్రెసెంట్ నగర్‌లో పార్కు స్థలాన్ని కాపాడిన హైడ్రా




**– 1200 గజాల పార్కు స్థలానికి ఫెన్సింగ్, బోర్డు ఏర్పాటు**

**ఆదాబ్ సైబరాబాద్, మేడ్చల్––మల్కాజిగిరి :** మేడిపల్లి మండలం చెంగిచెర్లలోని క్రెసెంట్ నగర్‌లో 1200 గజాల పార్కు స్థలాన్ని హైడ్రా అధికారులు పరిరక్షించారు. పార్కు స్థలాన్ని కొందరు ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారంటూ ఈసీఐఎల్ ఎంప్లాయీస్ ఓనర్స్ అసోసియే షన్ ప్రతినిధులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేయడంతో అధికారులు చర్యలు చేపట్టారు. చెంగిచెర్ల గ్రామంలోని సర్వే నంబర్లు 134, 139లో 1989లో ఈసీఐఎల్ ఎంప్లాయీస్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 'క్రెసెంట్ నగర్' పేరుతో 106 ప్లాట్లతో గ్రామపంచాయతీ లేఅవుట్ ఏర్పాటు చేశారు. లేఅవుట్‌లో 1200 గజాల స్థలాన్ని పార్కు కోసం, మరికొంత స్థలాన్ని ప్రజా అవసరాల కోసం కేటాయించినట్లు హైడ్రా అధికారులు గుర్తించారు. పార్కు స్థలాన్ని ఆక్రమణల నుంచి కాపాడాలని అసోసియేషన్ ప్రతినిధులు కోరడంతో హైడ్రా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు. సంబంధిత అధికారులతో కలిసి స్థలాన్ని పరిశీలించిన అనంతరం అది పార్కు స్థలంగా నిర్ధారించారు. ఈ మేరకు మంగళవారం పార్కు స్థలం, ప్రజా అవసరాల కోసం కేటాయించిన స్థలం అని స్పష్టంగా తెలియజేస్తూ హైడ్రా బోర్డును ఏర్పాటు చేశారు. భవిష్యత్తులో ఆక్రమణలకు అవకాశం లేకుండా స్థలానికి ఫెన్సింగ్ ఏర్పాటు చేసి పరిరక్షణ చర్యలు చేపట్టారు. ప్రజా అవసరాల కోసం కేటాయించిన పార్కులు, ఓపెన్ స్పేస్‌లు, ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించడంలో భాగంగా హైడ్రా నిరంతరం చర్యలు చేపడుతుందని
అధికారులు తెలిపారు.

# 22ఏ నిషేధిత జాబితా పై పొంగులేటి క్లారిటీ

**– పేదల భూములకు పూర్తి రక్షణ.. అన్యాయం జరగనివ్వం**
**– 15 రోజుల పాటు రోజువారీగా దరఖాస్తుల పరిశీలన**
**– ప్రజలను తప్పుదోవ పట్టించొద్దు: రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం**



**ఆదాబ్ సైబరాబాద్, హైదరాబాద్ :** 22ఏ నిషేధిత జాబితాకు సంబంధించి తలెత్తిన సమస్యలను ప్రభుత్వం గుర్తించి, తప్పులను సరిదిద్దే ప్రక్రియను యుద్ధప్రాతిపదికన చేపట్టిందని రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గత 24 గంటల్లోనే మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లాలో 30, రంగారెడ్డి జిల్లాలో 4 కలిపి మొత్తం 34 రిజిస్ట్రేషన్లు పూర్తి చేసినట్లు వెల్లడించారు. మంగళవారం సచివాలయంలోని తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన మంత్రి.. 22ఏ నిషేధిత జాబితాలో తమ భూములు చేరాయని ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. సమస్య పరిష్కార ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందని తెలిపారు.
"ఇది పేదల ప్రభుత్వం. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో, పేదల ఆశీస్సులతో అధికారంలోకి వచ్చిన ఇందిరమ్మ ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ పేదవాడికి అన్యాయం చేయదు. పేదవాడి న్యాయబద్ధమైన భూమిలో ఒక్క అంగుళం కూడా ఈ ప్రభుత్వం తీసుకోదు. వారి హక్కులు, ఆస్తులకు సంపూర్ణ రక్షణ కల్పించడం మా బాధ్యత" అని మంత్రి పేర్కొన్నారు.

## ■ ఆన్‌లైన్ అప్‌లోడింగ్‌లో సాంకేతిక లోపాలు

హైకోర్టు ఆదేశాల మేరకు 22ఏ నిషేధిత భూముల వివరాలను ఆన్‌లైన్ సాఫ్ట్‌వేర్‌లో అప్‌లోడ్ చేసే క్రమంలో క్షేత్రస్థాయిలో కొన్ని పొరపాట్లు చోటుచేసుకున్నాయని మంత్రి వివరించారు. ఈ తప్పులను ప్రభుత్వం గుర్తించి యుద్ధప్రాతిపదికన సరిదిద్దుతోందన్నారు. గత ప్రభుత్వాల కాలంలో వివిధ జీవోలు, మెమోల ద్వారా క్రమబద్ధీకరించిన ప్రైవేట్ భూములు, హైకోర్టు, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ అనుమతులు పొందిన స్థలాలు సైతం ఆన్‌లైన్ అప్‌లోడింగ్‌లో తలెత్తిన సాంకేతిక లోపాల కారణంగా 22ఏ జాబితాలోకి వచ్చినట్లు తెలిపారు.
సమస్యను గుర్తించిన వెంటనే ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, బాధితులకు ఇబ్బందులు కలగకుండా రిజిస్ట్రేషన్ల ప్రక్రియను పునరుద్ధరించామని చెప్పారు.

## ■ 15 రోజుల పాటు ప్రత్యేక పరిశీలన

22ఏ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ ఐజీతో పాటు ఇతర ఉన్నతాధికారులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసినట్లు పొంగులేటి తెలిపారు. ఈ కమిటీ రాబోయే 15 రోజుల పాటు రోజువారీగా దరఖాస్తులను పరిశీలిస్తుందని చెప్పారు. అర్హత కలిగిన, నిజమైన ప్రైవేట్ ఆస్తులను వేగంగా 22ఏ జాబితా నుంచి తొలగించి క్లియర్ చేసేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

## ■ తప్పును అంగీకరించి సరిదిద్దుతున్నాం

బాధ్యతాయుతమైన ప్రభుత్వంగా జరిగిన పొరపాటును పారదర్శకంగా అంగీకరించడమే కాకుండా, దాన్ని సరిదిద్దే బాధ్యతను కూడా ప్రభుత్వం తీసుకుందని మంత్రి స్పష్టం చేశారు. "తప్పు జరిగితే అధికారులపైకి నెట్టి చేతులు దులుపుకోవడం మా ప్రభుత్వ విధానం కాదు. మాకు చిత్తశుద్ధి ఉంది కాబట్టే జరిగిన పొరపాటును అంగీకరించాం. అదే సమయంలో దాన్ని సరిదిద్దే బాధ్యతను కూడా తీసుకున్నాం. ప్రజలను ఇబ్బందుల్లో వదిలేసే ప్రభుత్వం మాది కాదు" అని అన్నారు.

## ■ రాజకీయాలకు వాడుకోవద్దు

22ఏ అంశాన్ని రాజకీయంగా ఉపయోగించుకుని ప్రజలను తప్పుదోవ పట్టించొద్దని మంత్రి ప్రతిపక్షాలకు సూచించారు. పేదల సమస్యను రాజకీయ ప్రచారానికి ఉపయోగించడం మానుకోవాలని అన్నారు. "ఇప్పుడు పేదవాడి సమస్యను రాజకీయంగా వాడుకోవడం మానేయండి. ఇది పేదల ప్రభు త్వం.. పేదల ఆశీస్సులతో వచ్చిన ఇందిరమ్మ ప్రభుత్వం. పేద వాడి న్యాయబద్ధమైన భూమిలో ఒక్క అంగుళం కూడా అన్యా యం జరగనివ్వం. మేం తప్పును ఒప్పుకుని దిద్దుతున్నాం.. మీరు చేసిన తప్పులను ఒప్పుకునే ధైర్యం మీకుందా?" అని ప్రశ్నించారు. అబద్ధాలు, ఆరోపణలు, రాజకీయ ప్రచారాలతో ప్రజలను తప్పుదోవ పట్టించలేరని మంత్రి అన్నారు. సామాన్య ప్రజల హక్కులు, ఆస్తులకు పూర్తి రక్షణ కల్పించడమే
ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు.

# కల్తీ ఖోవా అక్రమ రవాణా చేస్తున్న వ్యక్తి అరెస్ట్




**– 174 కిలోల కల్తీ ఆహార పదార్థాలు స్వాధీనం**

**ఆదాబ్ సైబరాబాద్, వికారాబాద్ జిల్లా :** ఎస్పీ స్నేహ మెహ్రా ఆదేశాల మేరకు జిల్లాలో కల్తీ ఆహార పదార్థాల అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా కొనసాగుతోంది. ఇందులో భాగంగా జిల్లా టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ అన్వర్ పాషా తమ టీం సభ్యులతో నిర్వహించిన దాడిలో కల్తీ ఖోవాను అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు నిర్వహించిన రైడ్‌లో రాజస్థాన్ రాష్ట్రం, నాగౌర్ జిల్లా, మక్రానా మండలం, ఉంచెరియా గ్రామానికి చెందిన 36 ఏండ్ల వయసు గల రుపారామ్ (తండ్రి భేరురామ్) ప్రస్తుతం జహీరాబాద్ పట్టణంలోని పాష్తాపూర్ కాలనీలో నివాసం ఉంటున్న వ్యక్తి, అతను తన ఆటోలో కల్తీ ఖోవాను అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు. అతని వద్ద నుంచి 160 కిలోల కల్తీ ఖోవా, 14 కిలోల కలాకన్, మొత్తం 174 కిలోల ఆహార పదార్థాలను, సుమారు రూ.34,800/- విలువైనవి స్వాధీనం చేసుకున్నారు. ప్రజల ఆరోగ్యానికి హానికరమైన కల్తీ ఆహార పదార్థాలను తయారు చేయడం, రవాణా చేయడం లేదా విక్రయించడం వంటి చర్యలకు పాల్పడే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ప్రజలు కూడా అనుమానాస్పదంగా కల్తీ ఆహార పదార్థాల రవాణా లేదా విక్రయాలు జరుగుతున్నట్లు గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి" అని అని టాస్క్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ తెలిపినారు. స్వాధీనం చేసుకున్న కల్తీ ఆహార పదార్థాలు, ఆటో మరియు నిందితుడిని తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం తాండూర్ పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు.

# డ్రగ్స్ అక్రమ రవాణాపై ఉక్కుపాదం.. క్రైమ్ టీంకు ప్రత్యేక శిక్షణ

**– "డ్రగ్ ఫ్రీ –– క్రైమ్ ఫ్రీ వికారాబాద్" లక్ష్యంగా పకడ్బందీ చర్యలు**

**ఆధార్ సైబరాబాద్, వికారాబాద్ జిల్లా :** మాదకద్రవ్యాల అక్రమ రవాణా, సరఫరా, వినియోగాన్ని అరికట్టడమే లక్ష్యంగా వికారాబాద్ జిల్లా పోలీసు శాఖ చర్యలను ముమ్మరం చేస్తోంది. జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఆదేశాల మేరకు జిల్లా అదనపు ఎస్పీ రాజేష్ మీనా ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా క్రైమ్ టీం అధికారులకు ఎన్డీపీఎస్ కేసులపై ప్రత్యేక అవగాహన, శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్డీపీఎస్ కేసుల దర్యాప్తు విధానం, మాదకద్రవ్యాల అక్రమ రవాణా మార్గాల గుర్తింపు, నిందితులపై నిఘా, సాంకేతిక ఆధారాల వినియోగం, మాదకద్రవ్యాల స్వాధీనం, చట్టపరమైన నిబంధనలపై అధికారులకు శిక్షణ ఇచ్చారు. జిల్లాలో డ్రగ్స్ అక్రమ రవాణా, సరఫరా, వినియోగాన్ని పూర్తిస్థాయిలో నియంత్రించేందుకు అధికారులు పకడ్బందీగా పనిచేయాలని అదనపు ఎస్పీ రాజేష్ మీనా సూచించారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణాకు పాల్పడుతున్న వ్యక్తులతో పాటు వాటి వెనుక ఉన్న నెట్‌వర్క్‌లను గుర్తించి, వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.
"డ్రగ్ ఫ్రీ –– క్రైమ్ ఫ్రీ వికారాబాద్" లక్ష్యంగా అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్ సరఫరా, రవాణా మార్గాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించాలని పేర్కొన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో డీటీసీ డీఎస్పీ శ్రీనివాస్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ బల్వంత్ రాయ్, జిల్లా క్రైమ్ టీం అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



TGTEL/26/A4985
ఆదాబ్ సైబరాబాద్
ADAAB CYBERABAD
బుధవారం,
ఆగస్టు 19, 2026



## మేడారంలో నార్కోటిక్స్ డాగ్ తో సడెన్ చెక్స్
## కిరాణా షాపుల్లో నార్లాపూర్ ఎస్.ఐ కమాలకర్ తనిఖీలు

**– గంజాయిపై ఉక్కుపాదం మేడారంలో షాపుల తనిఖీలు**



**ఆదాబ్ సైబరాబాద్, ములుగు:** ములుగు జిల్లాలోని ఎస్ఎస్ తాడ్వాయి మండలం, మేడారంనార్లాపూర్ ఎస్.ఐ మంగళవారం మేడారం ప్రాంతంలోని సందేహాస్పద కిరాణా షాపుల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో నార్కోటిక్స్ డాగ్ సహాయంతో షాపులను క్షుణ్ణంగా పరిశీలించారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల అక్రమ నిల్వలు, అమ్మకాలపై ప్రత్యేక నిఘా ఉంచారు. యువతను మత్తుకు బానిసలుగా చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామనిహెచ్చరించారు. షాపు యజమానులకు నిబంధనలు పాటిం చాలని, అనుమానాస్పద వ్యక్తుల సమాచారం వెంటనే పోలీసులకు అందించాలని సూచించారు. భవిష్యత్తులోనూ ఇలాంటి తనిఖీలు కొనసాగుతాయని ఎస్.ఐ తెలిపారు.

## పాలిటెక్నిక్ విద్యార్థుల ఆందోళనకు రాజేందర్ గౌడ్ మద్దతు



**– జీవో నెం.97ను వెంటనే ఉపసంహరించుకోవాలి: అడ్వకేట్ రాజేందర్ గౌడ్**

**ఆదాబ్ సైబరాబాద్, వికారాబాద్ జిల్లా:** కలెక్టర్ కార్యాలయం ఎదుట పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు నిర్వహించిన ధర్నాకు గ్రాడ్యుయేట్ ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ తరపున అడ్వకేట్ రాజేందర్ గౌడ్ హాజరై సంపూర్ణ మద్దతు ప్రకటించారు. విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రాజేందర్ గౌడ్ మాట్లాడుతూ.. పాలిటెక్నిక్ విద్యార్థుల ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఉందని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్న జీవో నెం.97ను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం విద్యార్థులు శాంతియుతంగా ధర్నా చేస్తుంటే పోలీసులు వారిని నిర్బంధించడం బాధాకరమని అన్నారు. "శక్తి వద్దు.. సుత్తి వద్దు" అంటూ విద్యార్థులు చేపడుతున్న నిరసన వెనుక ఉన్న సమస్యలను ప్రభుత్వం అర్థం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులతో చర్చలు జరిపి వారి సమస్యలకు పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు.
విద్యార్థులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు కలెక్టర్ కార్యాలయానికి వచ్చినప్పటికీ, వారి గోడును వినేందుకు అధికారులు తగిన విధంగా స్పందించకపోవడం సరికాదని రాజేందర్ గౌడ్ అన్నారు. విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం, అధికారులు సానుకూలంగా పరిశీలించి తక్షణమే పరిష్కరించాలని కోరారు.

## సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలు స్ఫూర్తిదాయకం

**– సామాజిక సమానత్వం, బడుగు--బలహీన వర్గాల హక్కుల కోసం కృషి చేయాలి**
**– సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలో కలెక్టర్ దీపక్ తివారి**



**ఆదాబ్ సైబరాబాద్, వికారాబాద్ జిల్లా:** సామాజిక సమానత్వం, బడుగు--బలహీన వర్గాల హక్కుల కోసం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చేసిన పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి పిలుపునిచ్చారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా మంగళవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ దీపక్ తివారి సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అణగారిన వర్గాల హక్కుల కోసం, సామాజిక సమానత్వం కోసం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ధైర్యంగా పోరాడిన మహనీయుడని కొనియాడారు. అన్యాయం, దోపిడీ, అసమానతలకు వ్యతిరేకంగా ఆయన సాగించిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. సమాజంలోని బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సమానత్వం, సామాజిక న్యాయం, ప్రజా సంక్షేమం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఉమా శంకర్ ప్రసాద్, వెంకటాచారి, ట్రైనీ కలెక్టర్ సచిన్ బస్వరాజ్ గుట్టుర్, మాధవ రెడ్డి, జయపాల్ రెడ్డి, సీపీఓ వెంకటేశ్వర్లు, వికారాబాద్ జిల్లా గౌడ సంఘం అధ్యక్షులు మల్లికార్జున గౌడ్, నాయకులు వెంకటయ్య గౌడ్, బీసీ సంఘాల నాయకులు, అధికారులు, సిబ్బంది

## వికారాబాద్‌లో ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు

**– బహుజన హక్కుల పోరాటానికి పాపన్న గౌడ్ స్ఫూర్తిదాయకం: దుర్గం మల్లికార్జున్ గౌడ్**



**ఆదాబ్ సైబరాబాద్, వికారాబాద్ జిల్లా:** బహుజన వీరుడు, విప్లవ యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలను వికారాబాద్ పట్టణంలోని బిజేఆర్ చౌరస్తాలో జిల్లా గౌడ సంఘం అధ్యక్షులు, వికారాబాద్ మున్సిపల్ కౌన్సిలర్ దుర్గం మల్లికార్జున్ గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మల్లికార్జున్ గౌడ్ మాట్లాడుతూ.. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ బహుజనుల హక్కుల కోసం, సామాజిక సమానత్వం కోసం పోరాడిన మహనీయుడని కొనియాడారు. బహుజనాభ్యుదయానికి ఆయన చేసిన కృషి దిక్సూచిగా నిలిచిందన్నారు. పాపన్న గౌడ్ చూపిన ధైర్యం, సమానత్వం కోసం ఆయన సాగించిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లేం దుకు ప్రతి ఒక్కరూ కృషి చేయడమే పాపన్న గౌడ్‌కు అందించే నిజమైన నివాళి అని అన్నా రు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు వెంకటయ్య గౌడ్, కొంపల్లి శ్రీనివాస్ గౌడ్, ప్రభు గౌడ్, బిచ్చయ్య గౌడ్, పండు గౌడ్, కమ్మెట శ్రీనివాస్ గౌడ్, అశృత్ గౌడ్, బీసీ సంఘాల నేతలు, స్థానిక ప్రముఖులు, కార్యకర్తలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రూ.45 వేలతో విద్యుత్ కారును రూపొందించిన స్ఫూర్తి

**– రూ.1.60 లక్షలతో ఎలక్ట్రిక్ వాహనం తయారు చేసిన పార్థసారథి**
**– ఏటీసీ విద్యార్థుల ప్రతిభకు మంత్రి వివేక్ వెంకటస్వామి ప్రశంసలు**



**ఆదాబ్ సైబరాబాద్, మణుగూరు :** రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేస్తున్న అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు (ఏటీసీలు) కేవలం ఉద్యోగ శిక్షణ కేంద్రాలుగా కాకుండా యువతలోని సృజనాత్మకతను వెలికితీసి ఇన్నోవేటర్లుగా తీర్చిదిద్దే వేదికలుగా మారుతున్నాయని శక్తి, కార్మిక, ఉపాధి, శిక్షణ, ఫ్యాక్టరీస్, గనుల శాఖ మంత్రి డాక్టర్ జి. వివేక్ వెంకటస్వామి అన్నారు. పదో తరగతి తర్వాత ఏటీసీలో చేరిన విద్యార్థులు రెండేళ్ల శిక్షణతోనే విద్యుత్ వాహనాలను తయారు చేయడం రాష్ట్ర నైపుణ్య శిక్షణ వ్యవస్థకు నిదర్శనమని పేర్కొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులోని అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌ను మంగళవారం మంత్రి సందర్శించారు. ఏటీసీ విద్యార్థులు పార్థసారథి, స్ఫూర్తి రూపొందించిన వినూత్న విద్యుత్ వాహనాలను పరిశీలించి వారి ప్రతిభను అభినం దించారు. వాహనాల తయారీకి సంబంధించిన వివరాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మణుగూరు ఏటీసీలో శిక్షణ పూర్తి చేసి వివిధ సంస్థల్లో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులకు మంత్రి చేతుల మీదుగా నియామక పత్రాలను అందజేశారు.

### ■ ఏటీసీల మధ్య పోటీలు

వచ్చే ఏడాది నుంచి రాష్ట్రంలో ఏర్పాటయ్యే 119 ఏటీసీల్లో ప్రతి సంవత్సరం స్కిల్ కాంపిటిషన్స్ నిర్వహించనున్నట్లు మంత్రి ప్రకటించారు. ఏటీసీల మధ్య పోటీలు నిర్వహించి అత్యుత్తమ ప్రతిభ కనబరిచే ఇన్నోవేటర్లను గుర్తిస్తామని తెలిపారు.
టాప్--10లో నిలిచే ఇన్నోవేటర్లకు ప్రత్యేక అవార్డులు, ప్రోత్సాహకాలు అందించడంతో పాటు ఏటీసీల్లోనే ఉద్యోగ అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. విద్యార్థులు తమ ఆలోచనలను ఆవిష్కరణలుగా మార్చుకుని ప్రపంచస్థాయిలో పోటీపడేలా ప్రోత్సహిస్తామని తెలిపారు.

### ■ రూ.45 వేలతో ఎలక్ట్రిక్ కారు

మణుగూరు ఏటీసీ విద్యార్థుల ఆవిష్కరణలను మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. పాత, రీసైకిల్ చేసిన విడి భాగాలను ఉపయోగించి సుమారు రూ.45 వేల వ్యయంతో విద్యుత్ కారును స్ఫూర్తి రూపొందించారు. ప్రయాణికుల రవాణాతో పాటు సరుకు రవాణాకు ఉపయోగపడే విద్యుత్ వాహనాన్ని పులిపాటి పార్థసారథి సుమారు రూ.1.60 లక్షల వ్యయంతో అభివృద్ధి చేశారు. వారిద్దరికీ మంత్రి ప్రశంసా పత్రాలను అందజేశారు. మిగతా ఏటీసీ విద్యార్థులు పార్థసారథి, స్ఫూర్తిని స్ఫూర్తిగా తీసుకుని మరిన్ని ఆవిష్కరణలు చేయాలని సూచించారు. విద్యార్థులు రూపొందించిన ఆవిష్కరణలను ప్రదర్శనలకే పరిమితం చేయకుండా వాణిజ్య స్థాయికి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని మంత్రి అన్నారు. తక్కువ వ్యయంతో రూపొందిస్తున్న విద్యుత్ వాహనాలకు మార్కెట్ అవకాశాలు కల్పించేలా ప్రభుత్వం సహకరిస్తుందని తెలిపారు. అవసరమైన నిధులను సమకూర్చేందుకు కూడా ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు.

### ■ ప్రతి విద్యార్థికి శిక్షణతో పాటు ఉద్యోగం

ఏటీసీల్లో శిక్షణ పొందే ప్రతి విద్యార్థికి నైపుణ్య శిక్షణతో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని వివేక్ వెంకటస్వామి తెలిపారు. పరిశ్రమలకు అవసరమైన స్కిల్ సెట్లను యువతకు అందిస్తూనే, విద్యార్థుల్లోని సృజనాత్మక ఆలోచనలను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 119 ఏటీసీలను టాటా సంస్థ భాగస్వామ్యంతో అభివృద్ధి చేస్తున్నామని మంత్రి తెలిపారు. తెలంగాణలో టాటా సంస్థ సుమారు రూ.4 వేల కోట్ల పెట్టుబడితో సాంకేతిక శిక్షణ కేంద్రాల అభివృద్ధికి సహకరిస్తోందని చెప్పారు. పరిశ్రమల్లో మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా కొత్త కరిక్యులమ్, ఆధునిక కోర్సులను ఏటీసీల్లో ప్రవేశపెడు తున్నా మని తెలిపారు. పాత ఐటీఐల్లోని కోర్సులు పరిశ్రమల అవస రాలకు సరిపోకపోవడం వల్ల యువతకు ఉద్యోగ అవకాశాలు తగ్గాయని, ఈ సమస్యను అధిగమించేందుకే పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ఏటీసీలను తీర్చిదిద్దుతున్నామని వివరించారు.
మణుగూరు ఏటీసీలో శిక్షణ పొందుతున్న 100 మంది విద్యార్థులకు టాటా సంస్థలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని సంస్థ ప్రతినిధులు హామీ ఇచ్చినట్లు మంత్రి తెలిపారు.

### ■ నెలకు రూ.2 వేల స్టైఫండ్

ఏటీసీల్లో శిక్షణ పొందుతున్న విద్యార్థులకు నెలకు రూ.2 వేల స్టైఫండ్ అందించనున్నట్లు మంత్రి వెల్లడించారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా విద్యార్థులు శిక్షణకు దూరం కాకూడదనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు.
విద్యార్థులు శిక్షణపై పూర్తిస్థాయిలో దృష్టి సారించి మంచి ఉద్యోగాలు సాధించాలని సూచించారు. ఏటీసీల్లో ఉచిత అల్పాహారం అందించే కార్యక్రమాన్ని కూడా ప్రభుత్వం చేపట్టిందని తెలిపారు. విద్యార్థుల సంక్షేమంతో పాటు నైపుణ్యాభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందన్నారు.

### ■ విదేశీ ఉద్యోగాలకు ప్రత్యేక శిక్షణ

తెలంగాణ యువతకు విదేశాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని మంత్రి తెలిపారు. టామ్‌కామ్ ద్వారా విదేశీ ఉద్యోగ అవకాశాలను కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.90 కోట్లు కేటాయించిందని చెప్పారు. జర్మన్, జపనీస్ వంటి విదేశీ భాషల్లో శిక్షణ ఇచ్చి జర్మనీ, జపాన్ తదితర దేశాల్లో ఉద్యోగాలు పొందేలా యువతను సిద్ధం చేస్తున్నామని వివరించారు. విదేశీ సంస్థలతో అవగాహన ఒప్పందాలు చేసుకుని ఉద్యోగ అవకాశాలను అందుబాటులోకి తీసుకొస్తున్నామని తెలిపారు.

### ■ మణుగూరులో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్

మణుగూరు ప్రాంత యువతకు మరిన్ని ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటుపై దృష్టి సారిస్తామని మంత్రి తెలిపారు. ఐటీసీ సంస్థ సీఎస్ఆర్ నిధులతో సెంటర్ ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. మొదటి దశలో 100 మంది యువతను ఎంపిక చేసి శిక్షణ ఇవ్వాలని సూచించారు. జర్మన్ భాషతో పాటు పరిశ్రమలకు అవసరమైన ఇతర నైపుణ్యాల్లో శిక్షణ అందించి ఉద్యోగాలు కల్పించేలా అధికారులు, పరిశ్రమలు సమన్వయంతో పనిచేయాలని అన్నారు.
మారుమూల, గిరిజన ప్రాంతాల యువతకు ఏటీసీలు ఎంతో ఉపయోగకరంగా మారుతున్నాయని మంత్రి పేర్కొన్నారు. స్థానికంగానే కాకుండా రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఉద్యోగాలు పొందేలా యువతను తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

### ■ యువతకు ఉపాధే లక్ష్యం

ప్రభుత్వ ఉద్యోగాల భర్తీతో పాటు పరిశ్రమలు, నైపుణ్య శిక్షణ సంస్థలు, విదేశీ ఉద్యోగ అవకాశాల ద్వారా యువతకు ఉపాధి కల్పించేందుకు చర్యలు కొనసాగుతున్నాయని మంత్రి తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని ఉద్యోగ అవకాశాలు కల్పించేలా ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్తున్నామని చెప్పారు.
ఏటీసీల్లో శిక్షణ పొందుతున్న ప్రతి విద్యార్థి ఒక నైపుణ్యాన్ని నేర్చుకుని, ఒక ఆవిష్కరణకు శ్రీకారం చుట్టి, మంచి ఉద్యోగాన్ని సాధించి కుటుంబానికి అండగా నిలవాలని మంత్రి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, జిల్లా కలెక్టర్ అంకిత్, ఉపాధి శిక్షణ శాఖ జాయింట్ డైరెక్టర్ నగేశ్, రీజినల్ డైరెక్టర్ రాజా, డీఎస్పీ రవీందర్‌రెడ్డి, ఇతర అధికారులు, ఏటీసీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## రాజమార్గ యాత్ర యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో నెలవారీ లోకల్ పాస్

**– 20 కి.మీ. పరిధిలో నివసించే అర్హులైన వాహనదారులకు అవకాశం**
**– ఇక టోల్‌ప్లాజాకు వెళ్లి పత్రాలు సమర్పించాల్సిన అవసరం లేదు**



**ఆదాబ్ సైబరాబాద్, హైదరాబాద్ :** దేశవ్యాప్తంగా 121 టోల్‌ప్లాజాలకు డిజిటల్ ఫాస్టాగ్ లోకల్ పాస్ సౌకర్యాన్ని భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) విస్తరించింది. అర్హులైన వాహనదారులు ఇకపై టోల్‌ప్లాజాలకు వ్యక్తిగతంగా వెళ్లకుండా రాజమార్గ యాత్ర మొబైల్ యాప్ ద్వారా నెలవారీ లోకల్ పాస్‌ను ఆన్‌లైన్‌లో పొందవచ్చు.
డిజిటల్ ఇండియా కార్యక్రమం, పౌరులకు సేవలను మరింత సులభతరం చేయాలన్న కేంద్ర ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా ఈ సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చినట్లు ఎన్‌హెచ్‌ఏఐ తెలిపింది. టోల్ సేవల్లో పారదర్శకత, సామర్థ్యాన్ని పెంచడంతో పాటు జాతీయ రహదారులపై ప్రయాణాన్ని మరింత సౌకర్యవంతంగా మార్చడం ఈ విధానం ప్రధాన ఉద్దేశమని పేర్కొంది.

### ■ 20 కి.మీ. పరిధిలో నివాసం ఉంటే అర్హత

డిజిటల్ లోకల్ పాస్ విధానం అమల్లో ఉన్న టోల్‌ప్లాజాకు 20 కిలోమీటర్ల పరిధిలో నివసించే వాహనదారులు ఈ పాస్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. నిబంధనల ప్రకారం అర్హత పొందిన వారికి సంబంధిత నెలలో ఆ టోల్‌ప్లాజా మీదుగా అపరిమిత ప్రయాణానికి లోకల్ పాస్ అవకాశం కల్పిస్తుంది.
గతంలో లోకల్ పాస్ పొందేందుకు వాహనదారులు సంబంధిత టోల్‌ప్లాజాకు స్వయంగా వెళ్లి నివాస చిరునామాతో పాటు ఇతర అర్హతలను నిర్ధారించే పత్రాలను సమర్పించాల్సి వచ్చేది. డిజిటల్ విధానంతో ఈ ప్రక్రియ మరింత సులభతరం కానుంది.

### ■ జూలైలో తొలిసారి ప్రారంభం

ఢిల్లీలోని అర్బన్ ఎక్స్‌టెన్షన్ రోడ్ (యూఈఆర్)పై ఉన్న ముంద్కా--బక్కర్వాలా టోల్‌ప్లాజా వద్ద 2026 జూలైలో తొలిసారిగా డిజిటల్ లోకల్ పాస్ సౌకర్యాన్ని ప్రారంభించారు. అక్కడ విజయవంతమైన అనంతరం ఈ సేవను దేశవ్యాప్తంగా 121 టోల్‌ప్లాజాలకు విస్తరించారు. రానున్న నెలల్లో మరిన్ని టోల్‌ప్లాజాలను ఈ డిజిటల్ లోకల్ పాస్ పరిధిలోకి తీసుకురానున్నట్లు ఎన్‌హెచ్‌ఏఐ వెల్లడించింది.

### ■ డిజిలాకర్, వాహన్‌తో అనుసంధానం

డిజిటల్ లోకల్ పాస్ కోసం ప్రభుత్వ డిజిటల్ వేదికలను ఉపయోగిస్తున్నారు. ప్రయాణికుడి నివాస చిరునామా, వాహన వివరాలు, అనుసంధానించిన ఫాస్టాగ్ తదితర సమాచారాన్ని ధ్రువీకరించేందుకు డిజిలాకర్, వాహన్ వంటి ప్రభుత్వ డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లతో సమ్మతి ఆధారిత అనుసంధానం చేపడుతున్నారు. అర్హతను జీఐఎస్ ఆధారిత ధ్రువీకరణ ద్వారా నిర్ధారిస్తారు. దరఖాస్తుదారు నమోదు చేసిన చిరునామా సంబంధిత టోల్‌ప్లాజా నిర్దేశిత 20 కిలోమీటర్ల పరిధిలో ఉందా లేదా అన్నది ఈ విధానం ద్వారా పరిశీలిస్తారు.

దీంతో మాన్యువల్‌గా పత్రాలు సమర్పించడం, భౌతికంగా ధ్రువీకరణ చేయించుకోవాల్సిన అవసరం తగ్గుతుంది. మానవ జోక్యాన్ని తగ్గించి అర్హులైన వాహనదారులకు లోకల్ పాస్ జారీ ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు పారదర్శకత, కచ్చితత్వాన్ని పెంచేలా ఈ వ్యవస్థను రూపొందించారు.

### ■ ఆన్‌లైన్‌లో పాస్ పొందే అవకాశం

డిజిటల్ లోకల్ పాస్ సౌకర్యం అందుబాటులో ఉన్న టోల్‌ప్లాజాల వివరాలు, పాస్ కోసం దరఖాస్తు చేసుకునే ప్రక్రియను రాజమార్గ యాత్ర వెబ్‌సైట్లో తెలుసుకోవచ్చు.
ఈ సదుపాయం ద్వారా స్థానిక వాహనదారులకు టోల్ చెల్లింపుల ప్రక్రియ మరింత సులభతరం కావడంతో పాటు, జాతీయ రహదారులపై పౌర కేంద్రక సేవలను మరింత విస్తరించేందుకు ఎన్‌హెచ్‌ఏఐ చర్యలు చేపడుతోంది.

## 62,252 మెట్రిక్ టన్నుల పాత చెత్త శాస్త్రీయ పద్ధతిలో శుద్ధి

**– 22 ఎకరాల విలువైన పట్టణ భూమి పునరుద్ధరణ**
**– 60 వేల మొక్కలతో మియావాకీ వనం అభివృద్ధి**







**ఆదాబ్ సైబరాబాద్, రాయచూరు :** ఒకప్పుడు చెత్తకుప్పలతో, దుర్వాసనతో, కాలుష్యంతో నిండిపోయిన ప్రాంతం ఇప్పుడు పచ్చని వనంగా రూపుదిద్దుకుంటోంది. కర్ణాటకలోని రాయచూరు నగరంలో దశాబ్దాలుగా చెత్తను పారబోసిన యాకలాస్‌పురా ప్రాంతానికి కొత్త రూపు వచ్చింది. స్వచ్ఛ భారత్ మిషన్--అర్బన్ 2.0లో భాగంగా 35 ఎకరాల్లో విస్తరించిన వ్యర్థాల డంపింగ్ యార్డులో పేరుకుపోయిన పాత చెత్తను శాస్త్రీయ పద్ధతిలో తొలగించి, దాదాపు 22 ఎకరాల విలువైన పట్టణ భూమిని పునరుద్ధరించారు. యాకలాస్‌పురా ప్రాంతంలో ఏళ్ల తరబడి పేరుకుపోయిన మున్సిపల్ ఘన వ్యర్థాలతో చుట్టుపక్కల ప్రాంతాల్లో పర్యావరణ, ఆరోగ్య సమస్యలు తలెత్తేవి. చెత్త గుట్టల కారణంగా భూమి వినియోగానికి పనికిరాకపోవడంతో పాటు కలుషిత నీరు, దుర్వాసన, కాలుష్యం వంటి సమస్యలు ప్రజలను ఇబ్బందులకు గురిచేశాయి. ఈ పరిస్థితిని గుర్తించిన రాయచూర్ సిటీ కార్పొరేషన్ శాస్త్రీయ పద్ధతిలో పాత చెత్తను తొలగించే ప్రాజెక్టును చేపట్టింది. ఇప్పటివరకు 62,252 మెట్రిక్ టన్నుల పాత చెత్తను శుద్ధి చేసి, సుమారు 22 ఎకరాల భూమిని పునర్వినియోగానికి అనువుగా మార్చింది. దీంతో పర్యావరణ ప్రమాదాలను గణనీయంగా తగ్గించడంతో పాటు పరిసర ప్రాంతాల పరిస్థితిలోనూ మార్పు వచ్చింది.

### ■ చెత్త భూమిలో మియావాకీ వనం

పునరుద్ధరించిన భూమిని కేవలం ఖాళీ స్థలంగా వదిలేయకుండా పచ్చదనాన్ని పెంచేందుకు రాయచూర్ సిటీ కార్పొరేషన్ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా పునరుద్ధరించిన భూమిలోని 5 నుంచి 7 ఎకరాల్లో మియావాకీ వనం అభివృద్ధి చేస్తున్నారు. 2026 జూన్ 5న మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇప్పటికే సుమారు 60 వేల మొక్కలను నాటారు. వెదురుతో పాటు వివిధ స్వదేశీ జాతుల మొక్కలను పెంచుతున్నారు. ఏడాది లోపు ఈ ప్రాంతంలో గణనీయమైన అటవీకరణ సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మియావాకీ పద్ధతిలో మొక్కలను దట్టంగా పెంచడం ద్వారా పచ్చదనం వేగంగా అభివృద్ధి చెందడంతో పాటు కార్బన్ శోషణ, జీవవైవిధ్య పరిరక్షణ, గాలి నాణ్యత మెరుగుదలకు దోహదపడుతుందని అధికారులు తెలిపారు.

### ■ జూన్ 5న ప్రారంభించిన పునరుద్ధరణ ప్రాంతం

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా 2026 జూన్ 5న పునరుద్ధరించిన ప్రాంతాన్ని కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రారంభించారు. ఒకప్పుడు పర్యావరణ సమస్యలకు కేంద్రంగా ఉన్న ప్రాంతాన్ని ఇప్పుడు పచ్చని, పర్యావరణహిత ప్రదేశంగా తీర్చిదిద్దడం పట్టణ పరిపాలనలో కీలక మార్పుగా నిలిచింది.

### ■ ఇతర నగరాలకు ఆదర్శంగా..

యాకలాస్‌పురా మార్పు కేవలం చెత్త తొలగింపు ప్రాజెక్టుగా కాకుండా పట్టణ భూముల సమర్థ వినియోగానికి, పర్యావరణ పునరుద్ధరణకు ఒక నమూనాగా నిలుస్తోంది. దశాబ్దాలుగా సమస్యగా ఉన్న చెత్త డంపింగ్ ప్రాంతాన్ని పచ్చని ప్రదేశంగా మార్చడం ద్వారా పట్టణాల్లో వ్యర్థాల నిర్వహణకు కొత్త దిశను చూపిస్తోంది. స్వచ్ఛ భారత్ మిషన్--అర్బన్ 2.0లో భాగంగా దేశవ్యాప్తంగా పాత చెత్త డంపింగ్ ప్రాంతాలను శాస్త్రీయంగా పునరుద్ధరించి, వాటిని పర్యావరణహిత, ఉత్పాదక ప్రాంతాలుగా మార్చే కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. రాయచూరులో చేపట్టిన ఈ ప్రాజెక్టు ఇతర పట్టణాలకు కూడా అనుసరణీయ నమూనాగా నిలుస్తోంది.




# ప్రభుత్వ సూచిక బోర్డ్ ఏర్పాటు చెయ్యండి.!

*** వరుస కధనాలు వస్తున్న స్పందించని రెవిన్యూ యంత్రాంగం..మౌనం వెనుక మతలబు ఏంటి?**
*** రికార్డుల్లో గైరాన్ సర్కారీ భూమి.. క్షేత్రస్థాయిలో ప్లాట్ * ప్లాట్లు కొని అమాయకులు మోసపోక ముందే చర్య తీసుకోవాలని డిమాండ్ * కబ్జా పాపాన్ని హైడ్రాకు అపాదించే ప్రయత్నం చేస్తున్న రెవిన్యూ విభాగం**
*** ఉన్నత స్థాయి అధికారులు స్పందించాలని కోరుతున్న ప్రజలు**

**ఆదాబ్ సైబరాబాద్, కుత్బుల్లాపూర్ :** నగరం విస్తరిస్తున్న కొద్దీ భూముల విలువ కూడా పెరుగుతోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వానికి చెందిన విలువైన స్థలాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మరింత పెరుగుతోంది. కుత్బుల్లాపూర్ మండలం గాజులరామరం గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 329, 329/1 నుంచి 329/10 వరకు ఉన్న ప్రభుత్వ భూముల విషయంలో స్థానికుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. అన్నపూర్ణ మాత ఆలయం పరిసరాల్లో కోట్లాది రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూములు ఉన్నాయని, వాటిలో కొంత భాగం ఇప్పటికే ఆక్రమణలకు గురైందన్న ఆరోపణలు ఉన్నాయి. మరికొన్ని చోట్ల భవనాలు, అపార్ట్‌మెంట్ల నిర్మాణాలు జరుగుతున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. దీంతో ఈ భూముల అసలు స్థితి ఏమిటో అధికారులు ప్రజలకు స్పష్టంగా తెలియజేయాల్సిన అవసరం ఏర్పడింది.

## రికార్డుల్లో ప్రభుత్వ భూమి.. క్షేత్రస్థాయిలో పరిస్థితి ఏమిటి?

గతంలో వెలువడిన వివరాల ప్రకారం గాజులరామరం సర్వే నంబర్ 329 పరిధిలో సుమారు 255 ఎకరాల గైరాన్ ప్రభుత్వ భూమి ఉన్నట్లు పేర్కొనబడింది. అందులో కొంత భూమిలో కాలనీలు, బస్తీలు ఏర్పడ్డాయి. సుమారు 150 ఎకరాల వరకు వివిధ వినియోగాల్లోకి వెళ్లినట్లు గతంలో వచ్చిన కథనాల్లో ప్రస్తావన ఉంది. అయితే మిగిలి ఉన్న ప్రభుత్వ భూముల పరిస్థితిపై ఇప్పటికీ పూర్తి స్పష్టత అవసరం. ముఖ్యంగా సర్వే నంబర్ 329/1 నుంచి 329/10 వరకు ఉన్న భూములను అధికారులు మరోసారి క్షేత్రస్థాయిలో పరిశీలించి, రికార్డులతో సరిపోల్చాలని స్థానికులు కోరుతున్నారు.

## భవన నిర్మాణాలపై స్పష్టత ఇవ్వాలి

ప్రభుత్వ భూములకు సమీపంలోనే బహుళ అంతస్తుల భవనాలు నిర్మాణంలో ఉండటం స్థానికుల దృష్టిని ఆకర్షిస్తోంది. ఆయా నిర్మాణాలకు భవన అనుమతులు ఉన్నాయా? ఉంటే ఏ భూమి పత్రాల ఆధారంగా అనుమతులు మంజూరయ్యాయి? నిర్మాణం జరుగుతున్న స్థలం ప్రభుత్వ భూమికి చెందిందా? ప్రైవేట్ భూమా? అనే విషయాలపై సంబంధిత శాఖలు స్పష్టత ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు. ప్రభుత్వ భూముల్లో నిర్మాణాలకు అనుమతులు ఇవ్వకూడదని గతంలో రెవెన్యూ శాఖ నుంచి సంబంధిత అధికారులకు లేఖలు వెళ్లినట్లు అందుబాటులో ఉన్న పత్రాలు సూచిస్తున్నాయి. అలాంటప్పుడు ప్రస్తుతం కనిపిస్తున్న నిర్మాణాల విషయంలో అధికారులు మరోసారి పరిశీలన చేయడం అవసరమని స్థానికులు అంటున్నారు.

## అధికారులపై నిందలు కాదు.. స్పష్టత కావాలి

ప్రభుత్వ భూముల విషయంలో ప్రజల్లో ఉన్న సందేహాలను నివృత్తి చేయడం ముఖ్యం. కొందరు రాజకీయ నాయకులు, వ్యక్తులు ప్రభుత్వ భూములను ఆక్రమిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నప్పటికీ, వాటిని నిర్ధారించాల్సింది అధికారిక విచారణ ద్వారానే. అధికారులపై ఆరోపణలు చేయడం కంటే.. ప్రభుత్వ భూమి ఏది? ప్రైవేట్ భూమి ఏది? ఏ నిర్మాణానికి అనుమతి ఉంది? ఏది అక్రమ నిర్మాణం? అనే విషయాలను అధికారులు ప్రజల ముందుంచాలని స్థానికులు కోరుతున్నారు.

## సమగ్ర సర్వేతో సమస్యకు పరిష్కారం

సర్వే నంబర్ 329 పరిధిలోని మొత్తం ప్రభుత్వ భూములను రెవెన్యూ అధికారులు మరోసారి సర్వే చేసి, హద్దులను గుర్తించాలని స్థానికులు కోరుతున్నారు. అనంతరం జీహెచ్ఎంసీ, టౌన్‌ప్లానింగ్ అధికారులతో కలిసి అక్కడ జరుగుతున్న నిర్మాణాలను పరిశీలించాలని చెబుతున్నారు. ప్రభుత్వ భూమి అయితే దాన్ని రక్షించడం.. ప్రైవేట్ భూమి అయితే యజమానులకు ఇబ్బంది లేకుండా చూడడం.. ఇదే అధికారుల ముందున్న బాధ్యత అని స్థానికులు పేర్కొంటున్నారు. కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ భూములు భవిష్యత్ తరాలకు కూడా ఉపయోగపడాల్సిన ఆస్తి. అందుకే వివాదాలు పెరగకముందే అధికారులు స్పష్టమైన చర్యలు తీసుకుని, ప్రభుత్వ భూములకు హద్దులు నిర్ణయించి, నోటీసు బోర్డులు ఏర్పాటు చేయాలని గాజులరామరం ప్రజలు కోరుతున్నారు.

## అమాయకలు మోసపోకముందే

నగరంలో నివసిస్తూ చిన్న చిన్న ఉద్యోగులు చేసుకుంటూ ఒక్కక్క రూపాయి కూడబెట్టి ఎన్నో ఆశలతో కొనుక్కున్న నిర్మాణాలను అధికారులు అక్రమమని కూల్చేసిన సందర్భాలు ఎన్నో చూసాము. ఈ సంఘటనలతో ఎన్నో కుటుంబాలు రోడ్డునపడ్డాయి. భూమి యొక్క స్వరూపాలు తెలియక భూ చట్టాల పై అవగాహన లేక అసైన్డ్, గైరాన్ సర్కారీ, శిఖం, సీలింగ్ అలాగే ఇతర లిటికేషన్ భూములు కొని మోసపోతారు. అదికారులు ముందే ఎలాంటి సూచిక బోర్డులు ఏర్పాటు చెయ్యక పోవడం వల్లే ఇలాంటి సమస్యలు ఏర్పడతాయి. ప్రస్తుతం గాజులరామరం సర్వే నెంబర్ 329 అన్నపూర్ణ దేవాలయం ప్రక్కన నిర్మిస్తున్న అపార్ట్మెంట్ వద్ద ప్రభుత్వ సూచిక బోర్డ్ ఏర్పాటు చేస్తే ఫ్లాట్లు కొనుకునే వారు ముందే జాగ్రత్త పడే అవకాశాలు ఉంటాయి. లేదంటే భవిషత్తులో అయొక్క భూ వివాదం వల్ల అమాయకులు నష్టపోయే అవకాశాలు ఉంటాయి.

## ప్రతి ప్రభుత్వ స్థలం వద్ద నోటీసు బోర్డు ఉండాలి




ప్రభుత్వ భూములను కాపాడేందుకు సులభమైన, పారదర్శకమైన చర్యగా ఆయా స్థలాల వద్ద శాశ్వత నోటీసు బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. బోర్డుపై సర్వే నంబర్, భూమి విస్తీర్ణం, భూమి ప్రభుత్వానికి చెందినదనే వివరాలతో పాటు "ఈ భూమి ప్రభుత్వ ఆస్తి. ఎలాంటి ఆక్రమణలు, కొనుగోళ్లు, విక్రయాలు లేదా నిర్మాణాలు చేయరాదు" అని స్పష్టంగా పేర్కొనాలని కోరుతున్నారు.

ఇలాంటి బోర్డులు ఉంటే ప్రజలకు కూడా అవగాహన కలుగుతుంది. భూమిని కొనుగోలు చేసే వారు కూడా ముందుగానే వాస్తవాలను తెలుసుకునే అవకాశం ఉంటుంది. భవిష్యత్‌లో అక్రమ లావాదేవీలు, ఆక్రమణలకు అడ్డుకట్ట వేసేందుకు ఇది ఉపయోగపడుతుందని స్థానికులు భావిస్తున్నారు.

EDITOR PRINTER AND PUBLISHER OWNED BY BILLALPURSARA SHIVA KUMAR, PRINTING AT RIYAZ PRINTING PRESS, S NO 22-8-161, BEHIND NAYAAB HOTEL, CHATTA BAZAR, HYDERABAD, TELANGANA - 500002 AND PUBLISHED FROM H.NO: 2-1-602, TARAKARAMA NAGAR, YELLAMMABANDA, KUKATPALLY, MEDCHEL- MALKAJGIRI DIST, TELANGANA-500 072. PRGI: TGTEL/26/A4985. PHONE NO: +91 8686861338, +91 81215 50907 EMAIL : shivakumarlal@gmail.com

# 1.56 లక్షలకుపైగా పాఠశాలల్లో ప్రత్యేక డ్రైవ్

**- 5-17 ఏళ్ల పిల్లలకు సెప్టెంబర్ 30 వరకు ఎంబీయూ ఉచితం**

**- తల్లిదండ్రులు సకాలంలో ఆధార్ బయోమెట్రిక్ అప్‌డేట్ చేయించాలని సూచన**




**ఆదాబ్ సైబరాబాద్, హైదరాబాద్ :** దేశవ్యాప్తంగా పాఠశాల విద్యార్థుల కోసం చేపట్టిన ప్రత్యేక తప్పనిసరి బయోమెట్రిక్ అప్‌డేట్ (ఎంబీయూ) కార్యక్రమంలో భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (యూఐడీఏఐ) కీలక పురోగతి సాధించింది. ఇప్పటివరకు 2 కోట్లకు పైగా విద్యార్థుల ఆధార్ బయోమెట్రిక్ అప్‌డేట్ ప్రక్రియను పూర్తి చేసింది.దేశవ్యాప్తంగా సుమారు 1.56 లక్షల పాఠశాలల్లో ప్రత్యేక శిబిరాలను నిర్వహించడం ద్వారా విద్యార్థులకు ఆధార్ అప్‌డేట్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు యూఐడీఏఐ తెలిపింది. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల విద్యాశాఖల సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని 2025లో ప్రారంభించారు.

### ■ పాఠశాలలకే ఆధార్ సేవలు

పాఠశాల విద్యార్థుల ఎంబీయూ స్థితికి సంబంధించిన సమాచారాన్ని కలిగి ఉన్న యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ ఎడ్యుకేషన్ ప్లస్ (యూడీఐఎస్‌ఈ)తో యూఐడీఏఐ సాంకేతికంగా అనుసంధానమైంది. దీంతో విద్యార్థుల బయోమెట్రిక్ అప్‌డేట్ అవసరాన్ని గుర్తించి, పాఠశాల స్థాయిలోనే ప్రత్యేక శిబిరాలు నిర్వహించే అవకాశం ఏర్పడింది.
దీంతో విద్యార్థులు ఆధార్ కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా పాఠశాలల్లోనే ఎంబీయూ సేవలను పొందగలిగారు. కోట్లాది మంది విద్యార్థులకు ఈ ప్రక్రియ మరింత సులభంగా, సౌకర్యవంతంగా మారింది.

### ■ ఐదేళ్ల తర్వాత తొలిసారి బయోమెట్రిక్ నమోదు

ఐదేళ్లలోపు పిల్లలకు ఆధార్ నమోదు సమయంలో వారి డెమోగ్రాఫిక్ వివరాలు, ఫోటోను మాత్రమే తీసుకుంటారు. ఈ వయసులో వేలిముద్రలు, ఐరిస్ బయోమెట్రిక్ వివరాలను నమోదు చేయరు. పిల్లల శారీరక ఎదుగుదలతో బయోమెట్రిక్ వివరాల్లో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉండటమే ఇందుకు కారణం.పిల్లలకు 5 ఏళ్ల వయసులో ఒకసారి, 15 ఏళ్ల వయసులో మరోసారి తప్పనిసరి బయోమెట్రిక్ అప్‌డేట్ (ఎంబీయూ) చేయాల్సి ఉంటుంది. ఆధార్‌లో తాజా బయోమెట్రిక్ వివరాలు ఉండేలా ఈ ప్రక్రియను రూపొందించారు.

### ■ సెప్టెంబర్ 30 వరకు ఎంబీయూ ఉచితం

పిల్లలు సకాలంలో ఎంబీయూ పూర్తి చేసుకునేలా యూఐడీఏఐ ప్రత్యేక రుసుము మినహాయింపు కూడా కల్పించింది. 2026 సెప్టెంబర్ 30 వరకు 5 నుంచి 17 ఏళ్ల వయసున్న పిల్లలకు ఎంబీయూ ఉచితంగా అందుబాటులో ఉంటుంది.
7 నుంచి 15 ఏళ్ల మధ్య పిల్లలకు 2025 అక్టోబర్ 1 నుంచి ఏడాది పాటు ఎంబీయూ రుసుమును యూఐడీఏఐ మాఫీ చేసింది. 5 నుంచి 7 ఏళ్లు, 15 నుంచి 17 ఏళ్ల పిల్లలకు ఎంబీయూ ఇప్పటికే ఉచితంగానే కొనసాగుతోంది.

### ■ ఎంబీయూ లేకపోతే ఇబ్బందులు

ఆధార్‌లో తప్పనిసరి బయోమెట్రిక్ అప్‌డేట్ చేయకపోతే భవిష్యత్తులో ఆధార్ ఆధారిత ధ్రువీకరణ అవసరమయ్యే కొన్ని ప్రభుత్వ పథకాలు, సేవలను పొందడంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని యూఐడీఏఐ తెలిపింది.
అదేవిధంగా నీట్, జేఈఈ, సీయూఈటీ వంటి పోటీ పరీక్షలు, ఉన్నత విద్యా సంస్థల ప్రవేశ పరీక్షలకు నమోదు చేసుకునే సమయంలోనూ ఆధార్ ధ్రువీకరణ అవసరం ఏర్పడే అవకాశం ఉందని పేర్కొంది.పిల్లల ఆధార్‌లో బయోమెట్రిక్ వివరాలను సకాలంలో అప్‌డేట్ చేయించాలని తల్లిదండ్రులు, సంరక్షకులను యూఐడీఏఐ కోరింది. తద్వారా భవిష్యత్తులో ఆధార్ ఆధారిత గుర్తింపు, ధ్రువీకరణ ప్రక్రియలు ఎలాంటి ఆటంకాలు లేకుండా కొనసాగుతాయని తెలిపింది.

# బీసీల ఓట్లతో గెలిచి.. బీసీలనే మోసం చేస్తారా?

**- రేవంత్ రెడ్డికి తీన్మార్ మల్లన్న సవాల్**
**కొడంగల్‌లో బీసీల ఓట్లు 1,36,034**
**- రెడ్డి ఓట్లు 12,567 మాత్రమే**
**- బీసీల ఓట్లతోనే సీఎం అయ్యావ్**
**- ఇక బీసీల రాజ్యాధికారాన్ని అడ్డుకోలేరు**
**జడ్చర్ల, మహబూబ్‌నగర్, దేవరకద్రలో బీసీలదే మెజారిటీ**
**- 59 నియోజకవర్గాల్లో బీసీల గెలుపే లక్ష్యంగా సర్జికల్ స్ట్రైక్ 59**
**- టీఆర్పీ చీఫ్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న**



**ఆదాబ్ సైబరాబాద్, హైదరాబాద్ :** బీసీల ఓట్లతో అధికారంలోకి వచ్చి అదే బీసీలకు రాజకీయంగా అన్యాయం చేస్తే ఇక సహించేది లేదని తెలంగాణ రాజ్యాధికార పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. బీసీల రాజకీయ హక్కులు, రాజ్యాధికార సాధన కోసం తమ పార్టీ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తుందని ప్రకటించారు.
కొడంగల్ నియోజకవర్గంలో మొత్తం 2,36,789 మంది ఓటర్లు ఉండగా, అందులో 1,36,034 మంది బీసీ ఓటర్లు ఉన్నారని మల్లన్న తెలిపారు. అంటే మొత్తం ఓటర్లలో బీసీల వాటా 57.45 శాతమని పేర్కొన్నారు. అదే సమయంలో రెడ్డి ఓటర్లు 12,567 మంది మాత్రమే ఉన్నారని చెప్పారు. బీసీల ఓట్లతోనే రేవంత్ రెడ్డి రాజకీయంగా ఎదిగారని, బీసీల మద్దతు లేకుండా కొడంగల్‌లో ఆయన రాజకీయ బలం ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు.కొడంగల్ బీసీలకు రాజకీయంగా కీలకమైన ప్రాంతమని, ఎన్. వెంకటయ్య, సూర్యనారాయణ వంటి బీసీ నాయకుల రాజకీయ వారసత్వం ఈ ప్రాంతానికి ఉందని మల్లన్న గుర్తుచేశారు.

### ■ జడ్చర్లలోనూ బీసీలదే ఆధిపత్యం

జడ్చర్ల నియోజకవర్గంలో 1,37,748 మంది బీసీ ఓటర్లు ఉన్నారని, మొత్తం ఓటర్లలో 62.47 శాతం బీసీలేనని మల్లన్న తెలిపారు. రెడ్డి ఓటర్లు 10,499 మంది మాత్రమే ఉన్నారని పేర్కొన్నారు.ఎర్ర సత్యం వంటి బీసీ నాయకుల రాజకీయ వారసత్వాన్ని దెబ్బతీశారని ఆరోపించిన ఆయన.. ఆ వారసత్వాన్ని తెలంగాణ రాజ్యాధికార పార్టీ ముందుకు తీసుకెళ్తుందని స్పష్టం చేశారు. ఎర్రశేఖర్, మధుసూదన్ యాదవ్, ఎడ్ల బాలవర్ధన్ గౌడ్ వంటి నాయకులు బీసీ రాజకీయ శక్తికి ప్రతినిధులుగా నిలుస్తున్నారని అన్నారు.

### ■ మహబూబ్‌నగర్, దేవరకద్రలోనూ బీసీల బలం

మహబూబ్‌నగర్ నియోజకవర్గంలో 1,57,839 మంది బీసీ ఓటర్లు ఉండగా, రెడ్డి ఓటర్లు 12,031 మంది మాత్రమే ఉన్నారని మల్లన్న తెలిపారు. బీసీల ఓట్లను రాజకీయంగా ఉపయోగించుకుని రెడ్ల ఆధిపత్యాన్ని కొనసాగిస్తూ బీసీలను అణగదొక్కుతున్నారని ఆయన ఆరోపించారు.
దేవరకద్ర నియోజకవర్గంలోనూ బీసీ ఓటర్లు భారీ సంఖ్యలో ఉన్నారని, రెడ్డి ఓటర్ల కంటే బీసీల సంఖ్య దాదాపు 13 రెట్లు ఎక్కువగా ఉందని పేర్కొన్నారు. బాలకృష్ణ, వర్మ ముదిరాజ్, కాటం ప్రదీప్ కుమార్ గౌడ్ వంటి బీసీ నాయకత్వం అక్కడ బలంగా ఉందన్నారు.

### ■ 'బీసీల ఓట్లు కావాలి.. రాజ్యాధికారం మాత్రం వద్దా?'

ఎన్నికల సమయంలో బీసీల ఓట్లు అవసరమని భావించే పాలకులు.. బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం, రాజ్యాధికారం కల్పించే విషయంలో మాత్రం వెనుకడుగు వేస్తున్నారని మల్లన్న విమర్శించారు. బీసీలకు జనాభా ఆధారిత హక్కులు, తగిన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడంతో పాటు కులగణనపై స్పష్టమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### ■ 59 నియోజకవర్గాల్లో బీసీల గెలుపే లక్ష్యం

తెలంగాణలో బీసీల రాజకీయ శక్తిని ఏకం చేయడమే లక్ష్యంగా 'సర్జికల్ స్ట్రైక్--59' వ్యూహాన్ని ముందుకు తీసుకెళ్తున్నామని తీన్మార్ మల్లన్న ప్రకటించారు. బీసీల ఓట్లను విభజించి రాజకీయ ఆధిపత్యాన్ని కొద్దిమంది వర్గాలకే పరిమితం చేసే విధానాలకు ముగింపు పలకాల్సిన సమయం వచ్చిందన్నారు.
బీసీలు తమ ఓటు విలువను అర్థం చేసుకున్నారని, ఇకపై రాజకీయంగా తమ హక్కుల కోసం ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. 'మా ఓటు.. మా రాజ్యాధికారం' అనే నినాదంతో బీసీలు ఏకం కావాలని కోరారు. 2028 ఎన్నికలు తెలంగాణ రాజకీయాల్లో బీసీల కొత్త రాజకీయ శక్తికి నాంది పలుకుతాయని తీన్మార్ మల్లన్న ధీమా వ్యక్తం చేశారు.

# ఆరుతడి పంటలకు ప్రాధాన్యమివ్వండి

**- పీఎండీఎస్ విధానంతో పంటలకు స్థిరత్వం**
**- ఎల్‌నినో పరిస్థితులను సమర్థంగా ఎదుర్కోండి**
**- ప్రకృతి వ్యవసాయం అన్నదాతలకు వరం**
**- పొలం పిలుస్తోంది కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**









**ఎన్‌టీఆర్ జిల్లా/మైలవరంఆగస్టు 18, 2026**
ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ సూచించారు. ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో ముందస్తు ప్రణాళికతో పంటల సాగు చేపట్టాలని తెలిపారు.
మైలవరం మండలం, మొరుసుమిల్లిలో మంగళవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ పాల్గొన్నారు. ప్రస్తుతం సాగుచేస్తున్న పంటలు, ఆ పంటల సాగుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు ఎల్‌నినో పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ప్రణాళికను వివరించారు. ప్రకృతి వైపరీత్యాలు, వాతావరణ మార్పుల కారణంగా పంటలకు నష్టం వాటిల్లినప్పుడు రైతులకు ఆర్థిక రక్షణ కల్పించడంలో పంటల బీమా ఎంతో కీలకమని తెలిపారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఆరుతడి పంటలకు ప్రాధాన్యతనిస్తూ, అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని తెలిపారు. పీఎండీఎస్ పంటల సాగు ద్వారా నేలలో ఉష్ణోగ్రత తగ్గి, తేమ ఎక్కువ కాలం నిల్వ ఉండి పంటల స్థిరత్వం పెరుగుతుందన్నారు. అధిక ఆదాయాన్నిచ్చే ఉద్యాన పంటల సాగుతో పాటు పశు పోషణపైనా దృష్టిసారించాలని ఈ సందర్భంగా సూచించారు. ప్రకృతి వ్యవసాయం అన్నదాతలకు వరమని.. రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గిస్తూ ప్రకృతి వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడం ద్వారా సాగు ఖర్చులను తగ్గించుకోవడంతో పాటు నేల సారాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. ప్రకృతి వ్యవసాయంపై రైతులకు విస్తృత అవగాహన కల్పించి, రైతులను పెద్దఎత్తున ప్రోత్సహిస్తున్నట్లు పేర్కొన్నారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, వాతావరణ మార్పుల నేపథ్యంలో రైతులకు అవసరమైన సాంకేతిక సలహాలు, సూచనలు ఎప్పటికప్పుడు అందించడం జరుగుతోందని.. వీటిని రైతులు సద్వినియోగం చేసుకుని, సమర్థవంతమైన పంటల సాగు విధానాలను అవలంబించాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. కలెక్టర్ లక్ష్మీశ అధికారులతో కలిసి పీఎండీఎస్ పంటల క్షేత్రాన్ని సందర్శించారు. కార్యక్రమంలో రైతులతో పాటు జిల్లా వ్యవసాయ అధికారి సీహెచ్ తిరుమలదేవి, వ్యవసాయ శాఖ ఏడీ ఎం.శ్రీనివాసరావు, మండల వ్యవసాయ అధికారి కె.సంధ్యారాణి, వ్యవసాయ, అనుబంధ శాఖల పాల్గొన్నారు.

# విద్యార్థుల భద్రతపై షీ టీం అవగాహన కార్యక్రమం




**- మహిళల భద్రత, సైబర్ నేరాలు, డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన**

**ఆదాబ్ సైబరాబాద్, వికారాబాద్ జిల్లా:** వికారాబాద్ పట్టణంలోని వేదిక్ హై స్కూల్ లో షీ టీం ఆధ్వర్యంలో విద్యార్థులకు మహిళల భద్రత, సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల నివారణ తదితర అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఎస్సై ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. మహిళలు, బాలికల భద్రత కోసం షీ టీంలు అందిస్తున్న సేవలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. షీ టీం ప్రాధాన్యత, మహిళల భద్రతకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.షీ టీం ఇన్‌చార్జి బుచ్చేందర్ రెడ్డి విద్యార్థులకు టీఎస్‌ఏఎఫ్‌ఈ యాప్, అత్యవసర సేవల కోసం 112, సైబర్ నేరాల ఫిర్యాదుల కోసం 1930 టోల్‌ఫ్రీ నంబర్ గురించి వివరించారు. అలాగే పోక్సో చట్టం, మాదకద్రవ్యాల వ్యతిరేక చట్టాలు, ర్యాగింగ్ నిరోధక చట్టం, ట్రాఫిక్ నిబంధనలు, మహిళల భద్రత వంటి అంశాలపై అవగాహన కల్పించారు.
విద్యార్థులు ఎలాంటి సమస్య ఎదురైనా భయపడకుండా వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. సైబర్ మోసాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద లింకులు, సందేశాలకు స్పందించవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ప్రవీణ్ కుమార్, పాఠశాల ఇన్‌చార్జి అశోక్, కళాబృందం సభ్యులు, షీ టీం సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# బీఫార్మసీలో ప్రధమ ర్యాంకు సాధించిన పల్లెపాటి సౌందర్య.

**- దశాబ్ద కాలం తర్వాత జేఎన్టీయూ కి దక్కిన అరుదైన గౌరవం...**

**- పేద కుటుంబం నుంచి వికసించిన విద్యా కుసుమం....**

**రాజాపేట, ఆగస్టు 18 ):**
రాజాపేట తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ గా చక్కటి విధులు నిర్వహిస్తున్న పల్లెపాటి నరసింహులు రోజా దంపతుల కూతురు పల్లెపాటి సౌందర్య బీఫార్మసీలో జేఎన్టీయూ యూనివర్సిటీ లో మొదటి ర్యాంకు సాధించింది. రాజపేట లోని శ్రీ రామకృష్ణ విద్యా మందిర్ లో ప్రాథమిక, మాంటిసోరి హై స్కూల్ లో ఉన్నత విద్యను అభ్యసించి ఇంటర్ విద్య బండ్లగూడలో చదివిన సౌందర్య జేఎన్టీయూ యూనివర్సిటీ కె.వి. కె.సి.పి. లో బీఫార్మసీ విద్యాభ్యాసం చేసి ప్రధమ ర్యాంకు సాధించి అందరి మన్ననలు పొందింది. 1997లో జేఎన్టీయూ లో ప్రధమ ర్యాంకు సాధించగా తిరిగి 10 సంవత్సరాలకు పల్లెపాటి సౌందర్య ద్వారా మొదటి స్థానాన్ని దక్కించుకు న్నారు. పేద కుటుంబంకు కు చెందిన పల్లెపాటి నరసింహులు రోజా దంపతుల కూతురు సౌందర్య చిన్నప్పటినుండి చక్కటి విద్యాభ్యాసంతో ప్రాథమిక ఉన్నత ఇంటర్ స్థాయిలలో అత్యుత్తమ మార్కులతో ర్యాంకులు సాధిస్తూ బీఫార్మసీలో ఏకంగా మొదటి ర్యాంకును సాధించుకుంది. పేదింట్లో వికసించిన విద్యా కోసం పల్లెపాటి సౌందర్య ఎంఫార్మసీ చేయనున్నట్లు తన లక్ష్యాన్ని చేరుకోనున్నట్లు తెలిపింది. తల్లిదండ్రుల ప్రోత్సాహం వల్లే విద్యలో రాణిస్తున్నట్లు సౌందర్య అన్నారు.

# రాజాపేట లో మట్టి నీరే మంచినీరు

**- మిషన్ భగీరథ అధికారులు స్పందించాలని విన్నపం**

**- జలసాధన సమితి కన్వీనర్ ఎర్రగోకుల జస్వంత్..**

**రాజాపేట, ఆగస్టు 18:**
రాజపేట మండల కేంద్రంలో మిషన్ భగీరథ ద్వారా సరఫరా అవుతున్న నీరు మట్టితో కలిసి సరఫరా అవుతుంది అని జలసాధన సమితి కన్వీనర్ బిఆర్ఎస్ మండల నాయకులు ఎర్రగోకుల జస్వంత్ తెలిపారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ నల్లాల ద్వారా ఇంటింటికి సరఫరా అవుతున్న నీరు అపరిశుభ్రంగా ఉంటుందని తెలిపారు. ఈ విషయంపై మిషన్ భగీరథ అధికారులు స్పందించకపోవడం న్యాయం కాదన్నారు. దాదాపు నెల రోజుల నుండి ఎరుపు వర్ణంలో మట్టి నీరు సరఫరాగుతున్నట్లు దీంతో ప్రజలు అనారోగ్య పడనున్నారని ఆరోపించారు. ప్రజలకు అనా రోగ్య ఇబ్బందులు కలగాకముందే మిషన్ భగీరథ అధికారులు స్పందించాలని జస్వంత్ డిమాండ్ చేశారు.

# జన హృదయ నేత స్వర్గీయ కొత్తకోట దయాకర్ రెడ్డి 73 వ జయంతి

**నర్వ ఆగస్టు 18** నర్వ మండల కేంద్రంలో ఎన్టీఆర్ విగ్రహం దగ్గర స్వర్గీయ మాజీ ఎమ్మెల్యే కొత్తకోట దయాకర్ రెడ్డి 73 వ జయంతి వేళ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి జయంతి నిర్వహించారు ఇట్టి జయంతి వేడుకలకు రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి జగదభిరామిరెడ్డి మాజీ సర్పంచ్ పి కురుమారెడ్డి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కృష్ణారెడ్డి నాగన్న గారి శ్రీనివాస్ రెడ్డి వివేకవర్ధన్ రెడ్డి పోలీస్ జగన్ మోహన్ రెడ్డి మక్తల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పోలీస్ చంద్రశేఖర్ రెడ్డి నర్వ గ్రామ సర్పంచ్ టి హనుమంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు చెన్నయ్య సాగర్ శరణప్ప కృష్ణయ్య తదితరులు అభిమానులు పాల్గొన్నారు

# ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలు

**వలిగొండ ఆగస్టు 18**
వలిగొండ పట్టణ కేంద్రంలో మంగళవారం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలను ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడు మారగోని శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జోగు అంజన్న, ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు శీలం స్వామి మాట్లాడుతూ తెలంగాణ బహుజన ఆత్మగౌరవానికి, వీరత్వానికి ప్రత్యేకంగా నిలిచిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ సబ్బండ వర్గాల ప్రజలకు రాజకీయ సామాజిక సమానత్వం కోసం చేసిన కృషి మరచిపోలేనిదని కుల మతాల వివక్ష లేకుండా అన్ని వర్గాలు రాజ్యాధికారంలో భాగస్వామ్యం కావాలని సమసమాజ ప్రజాస్వామిక స్ఫూర్తితో మొగల్ చక్రవర్తుల కు వ్యతిరేకంగా పోరాడి గోల్కొండ కోటపై జెండా ఎగరవేసిన గొప్ప బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు బొడిగేసుదర్శన్, కొండూరు శ్రీరాములు, సత్తయ్య, పల్లెర్ల రామచందర్, గౌడ సంఘం అధ్యక్షుడు కొండూరు అంజయ్య, పాలకూర వెంకటేశం, పబ్బు సురేందర్, కంకల కిష్టయ్య, బత్తిని దేవేందర్, కొండూరు సాయి, శ్రీరాములు,బొడిగె సాయిలు, మునుకుంట్ల బిక్షపతి, కొండూరు సత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.